


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 246 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 15 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 246 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 15 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఏసీబీ ఉచ్చులో హెచ్ఎండీఏ సీఈ

- ఆదాయానికి మించి రూ.9.24 కోట్ల ఆస్తులు
- వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా





హైదరాబాద్ పెన్ పవర్: అవినీతి నిరోధక శాఖ వలకు మరో అధికారి చిక్కారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ అడ్డంగా దొరికిపోయారు. కొంతకాలంగా

- మిగతా 2లో


## ప్రజా సమస్యల పరిష్కారానికే
# పదేపదే ఢిల్లీకి

- గిట్టని వాళ్లే దీనిపై రాద్ధాంతం చేస్తున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేంద్ర మంత్రులు గడ్కరీ, రామ్మోహన్‌నాయుడుతో భేటీ
- ఆర్ఆర్ఆర్, ఫ్యూచర్ సిటీ
- బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై చర్చలు
- వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలను 2028 నాటికి పూర్తి చేయాలని వినతి




హైదరాబాద్ పెన్ పవర్:ఎలాంటి సమస్యలకైనా చర్చల ద్వారా పరిష్కారం దొరుకుతుంది. అందుకే పదేపదే ఢిల్లీ వస్తున్నా. గిట్టని వాళ్లు ఈ విషయంపై రాద్ధాంతం చేస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగం, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనుల ప్రారంభం కోసం మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో దాదాపు 30 నిమిషాలు, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో 45 నిమిషాల పాటు చర్చించారు. అనేక విషయాలు ప్రస్తావించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు.

"మెట్రో, ఆర్ఆర్ఆర్ విషయంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు వస్తే చర్చల ద్వారా పరిష్కరించుకుంటున్నాం. ఏ పనైనా ఆలస్యం అవుతున్నా, సమాచార లోపం ఉన్నా చర్చలే కీలకం. కేంద్రం పరిధిలో అనేక అంశాలు ఉంటాయి. అలాగే నిర్మాణం, భూసేకరణ విషయంలో స్థానికంగా సహకారం



ఉంటేనే పనులు వేగంగా జరుగుతాయి. గిట్టని వారు సీఎం పదేపదే ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారని విమర్శిస్తున్నారు.

- మిగతా 2లో





## 3 రోజుల్లో ఎల్ఐజీ ఫ్లాట్ల విస్తీర్ణం, డిజైన్లు ప్రకటిస్తాం

హైదరాబాద్ పెన్ పవర్: క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల విధివిధా నాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20న క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో అధికారు లతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. తొలిదశలో నియోజకవర్గానికి 500 నుంచి 1000 వరకు ఎల్ఐజీ ఫ్లాట్లు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లలో స్థలాలు గుర్తించామని చెప్పారు. 3 రోజుల్లో ఎల్ఐజీ ఫ్లాట్ల విస్తీర్ణం, డిజైన్లను ప్రకటిస్తామన్నారు.



## టీజీఎస్పీడీసీఎల్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు



- ఆలస్యంగా పిటిషన్ దాఖలు చేసి.. అత్యవసరంగా వాదనలు వినాలనడంపై ధర్మాసనం అసంతృప్తి
- ల్యాంకోకు రూ.130 కోట్ల బకాయిల చెల్లింపు అంశంపై పిటిషన్ కొట్టివేత
- అప్పిలేట్ ట్రిబ్యునల్‌నే ఆశ్రయించాలని సూచన

హైదరాబాద్ పెన్ పవర్: ల్యాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్‌కు రూ.130 కోట్లమేర కెపాసిటీ ఛార్జీలు చెల్లించాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్సీ) ఈ ఏడాది

- మిగతా 2లో

## సింగరేణిని నష్టాల ఊబిలోకి నెట్టారు

హైదరాబాద్ పెన్ పవర్:గత భారాస ప్రభుత్వం లాగే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సింగరేణిని దోచుకుంటోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. కష్టనష్టాల్లో కూరుకుపోయిన సంస్థను బతికించే బాధ్యత భాజపా తీసుకుందని.. త్వరలోనే కార్మికులకు కేంద్రం మరో శుభవార్త తెలియజేయనుందని హామీ ఇచ్చారు.

- మిగతా 2లో



## ఫిఫా వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్ లు.. కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం



- ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం బెంగళూరులో హోటళ్ల సమయం పొడిగింపు
- తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వ అనుమతి
- జులై 14, 15, 19 తేదీలకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తింపు
- అభిమానుల సౌకర్యార్థం, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం
- నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటన

- మిగతా 2లో

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి: ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

- హైదరాబాద్‌లో 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందన్న పొన్నం
- ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందన్న మంత్రి
- ప్రక్రియ పూర్తి కావడానికి ఈ గడువు సరిపోదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం కావాలని కోరారు. హైదరాబాద్‌లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని

- మిగతా 2లో






## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ
### పోలండ్ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు

- ఉక్రెయిన్‌పై అణుదాడిని ప్రధాని మోదీ నివారించారన్న పోలండ్ మంత్రి
- రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని వ్యాఖ్య
- మోదీ చెప్పే మాటలను పుతిన్ శ్రద్ధగా వింటారని వ్యాఖ్య
- 2022 చివర్లో అణుయుద్ధ భయాలు పెరిగిన వేళ ఈ పరిణామం

- మిగతా 2లో

## పీఓకేలో పాక్ దళాల కాల్పులు.. ఆరుగురు పౌరులు మృతి



పెన్ పవర్ డెస్క్:పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో ఆందోళనలు మరోసారి ఉధృతం అయ్యాయి. రావల్ కోట్ పరిధిలోని న్యూ బస్ టెర్మినల్ సమీపంలో హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పౌరులపై పాకిస్తాన్ భద్రతా దళాలు కాల్పులకు

- మిగతా 2లో

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్



- ఏబీ వెంకటేశ్వరరావు కాల్ రికార్డింగ్స్ ను నిందితులు సేకరించినట్టు గుర్తించిన సిట్
- సాక్షిగా వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు
- కేసు దర్యాప్తు ముగింపునకు చేరుకున్నట్టు సమాచారం

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ కేసులో ఏపీ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. 2023లో వెంకటేశ్వరరావు కాల్ డేటా రికార్డింగ్స్ ను నిందితులు సేకరించినట్టు సిట్ గుర్తించింది. దీంతో, సాక్షిగా ఆయన వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు.

## ఎడిటర్ వ్యూ

# పీఓకేలో పాక్ దళాల కాల్పులు.. ఆరుగురు పౌరులు మృతి

- మొదటి పేజి తరువాయి

తెగబడ్డాయి. నిరసనకారులను చెదరగొట్టే నెపంతో పాక్ సైనిక, పారామిలిటరీ దళాలు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పాక్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా స్థానికుల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన అసంతృప్తి ఈ తాజా రక్తపాతంతో మరింత తీవ్రరూపం దాల్చింది.

**వైట్ హౌస్ చేరిన పీఓకే నిరసన గళం:**

తాజాగా జరిగిన ఈ దారుణానికి సరిగ్గా ఒక రోజు ముందే అమెరికాలోని వాషింగ్టన్‌లో నివసిస్తున్న పీఓకే కమ్యూనిటీ ప్రతినిధులు వైట్ హౌస్ వెలుపల భారీ ప్రదర్శన చేపట్టారు. మహిళలు, పిల్లలతో సహా సుమారు 100 మందికి పైగా ఈ నిరసనలో పాల్గొని తీవ్ర మానవీయ సంక్షోభాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లారు. పీఓకే పౌర నివాస ప్రాంతాల నుండి పాక్ సైన్యాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 40 లక్షల మంది ప్రజలను బాహ్య ప్రపంచానికి దూరం చేస్తూ పాక్ ప్రభుత్వం విధించిన ఇంటర్నెట్ బంధనాన్ని (బ్లాకౌట్) ఎండగట్టారు. తమ ప్రాణాలను కాపాడటానికి, మానవీయ సహాయం అందించడానికి భారత్ తక్షణమే జోక్యం చేసుకోవాలని నిరసనకారులు అసాధారణ విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో పూంచ్, దోడా సెక్టార్ల ద్వారా నియంత్రణ రేఖ (రాశీజ) ను తెరవాలని కూడా కోరారు.

**ఇది వ్యవస్థీకృత దోపిడే.. పాకిస్తాన్‌పై భారత్ ఆగ్రహం:**

పాకిస్తాన్ అక్రమంగా, బలవంతంగా ఆక్రమించుకున్న ప్రాంతాల్లో దశాబ్దాలుగా సాగిస్తున్న వ్యవస్థీకృత దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనాపరమైన అణచివేతకు పీఓకే లో జరుగుతున్న నిరసనలే ప్రత్యక్ష నిదర్శనం అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల సరఫరాను నిలిపివేయడం, పోలీసుల క్రూరత్వం, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లను అమలు చేయడం వంటి చర్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను భారత్ తీవ్రంగా విమర్శించింది. నిరాయుధ పౌరులపై ప్రాణాంతక బలప్రయో గం చేసిన ఫలితంగా విషాదకరమైన ప్రాణనష్టం జరిగిందని ఆయన అన్నారు. పౌరులపై సాగి స్తున్న అణచివేతకు అంతర్జాతీయ సమాజం పాక్?ను జవాబుదారీగా చేయాలని భారత్ పేర్కొంది.

# ఫిఫా వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్ లు.. కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం

ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఫుట్‌బాల్ క్రీడ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. అభిమానుల అభ్యర్థన మేరకు బెంగళూరులో ఆహార సేవల సమయాన్ని అర్ధరాత్రి 1 గంట నుంచి 3:30 గంటల వరకు పొడిగిస్తున్నాం. ప్రజా భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు.

# సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పదేపదే ఢిల్లీకి

- మొదటి పేజి తరువాయి

నేను ఎప్పుడు వచ్చినా ప్రజల కోసమే పని చేస్తున్నా. సోమవారం అన్ని పార్టీల ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చా. కేంద్రం నుంచి తెచ్చుకోవాల్సిన నిధులు, అనుమతుల గురించిన సమాచారాన్ని ఎంపీలందరికీ అందించా. పార్లమెంటు సమావేశాల సమయంలో మళ్లీ ఢిల్లీ వచ్చి మూడు నాలుగు రోజులు ఉంటా. పలువురు కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చిస్తా. అభివృద్ధే లక్ష్యంగా కేంద్రం, రాష్ట్రాలు పనిచేస్తున్నాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఆర్ఆర్ఆర్ పనులు ఒకేసారి ప్రారంభించాలి..**

ముఖ్యమంత్రి రేవంత్.. తొలుత నితిన్‌గడ్కరీని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు రహదారులకు అనుమతుల గురించి వివరించారు. "రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయింది. నిర్మాణ పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించండి. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అనుమతులు మంజూరు చేసి రెండు వైపులా ఏకకాలంలో పనులు ప్రారంభించండి. దీనివల్ల ఇరు భాగాల పనులు త్వరగా పూర్తవడమే కాకుండా నిర్మాణ వ్యయం తగ్గుతుంది. అలాగే హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున దానికి వెంటనే అనుమతులు కావాలి. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టుకు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడ మధ్య 100 కి.మీ. దూరం తగ్గుతుంది. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అటవీ శాఖ అనుమతులు ఎంతో కీలకం. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా.. ఆరు వరుసల రహదారికి అవసరమైన భూసేకరణ చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వెంటనే అనుమతులు ఇవ్వండి" అని కేంద్ర మంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.

**హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు..**

వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనుల పురోగతిపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. "రెండు విమానాశ్రయాల్లో.. ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించండి. వరంగల్‌లో భూసేకరణ పూర్తయినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించండి" అని కోరారు.

**రామ్మోహన్‌నాయుడి సంపూర్ణ సహకారం..**

'విమానాశ్రయాల నిర్మాణం విషయంలో కేంద్ర కార్యాచరణ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహకారం గురించి మా భేటీలో చర్చించాం. తెలంగాణ ప్రజలపై ఎర్రన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు ఉన్న అభిమానం వీటి నిర్మాణానికి ఉపయోగపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చినా.. కేంద్ర మంత్రులు చొరవ తీసుకోకపోతే పనులు ఆలస్యం అవుతాయి. కానీ రామ్మోహన్‌నాయుడు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. "వికసిత్ భారత్-2047 లక్ష్యంలో భాగంగా దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ సంకల్పించారు. అందులో తెలంగాణ భాగస్వామ్యాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. దేశ జనాభాలో రెండున్నర శాతం ఉన్న తెలంగాణ ప్రజలు.. 5 శాతం జీడీపీని అందిస్తున్నారు. దీన్ని 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ అవతరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పరిశ్రమలు రావాలన్నా, వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతి చేయాలన్నా విమానాశ్రయాలు కీలకం. దీన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను నిర్మించి, పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాయి. జూన్ 2, 2028 నాటికి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని కోరా. స్థానిక చరిత్రకు ప్రాధాన్యం ఇస్తూ.. కాకతీయ కళా వైభవం, సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ విమానాశ్రయ నిర్మాణం ఉండాలని కేంద్ర మంత్రికి సూచించా" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. మంత్రులతో భేటీలో సీఎం వెంట నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఏసీబీ ఉచ్చులో హెచ్ఎండీఏ సీఈ

- మొదటి పేజి తరువాయి

ఏసీబీ దూకుడు పెంచగా ఈ నెల 2న పోలీస్ డీఎస్పీ భీంరెడ్డి ఉదంతం బయటపడిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున గచ్చిబౌలి సుమధుర అక్రోపోలిస్ గేటెడ్ కమ్యూనిటీలోని రవీందర్ ఇంటికి ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ నేతృత్వంలోని బృందం చేరుకుని సోదాలు చేశాయి. హెచ్ఎండీఏ కార్యాలయంతోపాటు రవీందర్ సన్నిహితులు, బినామీలు, బంధువుల ఇళ్లలాంటి మరో 9 ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు జరిగాయి. ఈ క్రమంలో రవీందర్ అధీనంలో ఉన్న చర, స్థిరాస్తులకు సంబంధించిన కీలక పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హెచ్ఎండీఏ విధుల్లో ఉన్నప్పుడు అక్రమార్జనతో కొనుగోలు చేసిన ఇళ్లు, స్థలాలను గుర్తించారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే వాటి విలువ రూ.9.24 కోట్లు అని నిర్ధారించగా.. బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. 18 విదేశీ మద్యం బాటిళ్లు కూడా లభించడంతో అబ్కారీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సోదాల అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.

**ఓఆర్ఆర్ లీజు వ్యవహారంలో కీలకం**

హెచ్ఎండీఏలో అసిస్టెంట్ ఇంజినీర్ నుంచి చీఫ్ ఇంజినీర్ వరకు దాదాపు మూడు దశాబ్దాల కాలంలో రవీందర్ కీలకంగా వ్యవహరించారు. పలు ముఖ్యమైన ప్రాజెక్టుల నిర్మాణంలో గుత్తేదారుల నుంచి లంచాల రూపంలో అడ్డగోలుగా సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. హెచ్ఎండీఏకు తలమానికంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను సుమారు రూ.6,600 కోట్లతో నిర్మించిన సమయంలో పలు హోదాల్లో పనిచేసిన ఆయన బాగానే కూడబెట్టారనే ప్రచారం ఉంది. ఓఆర్ఆర్ ఎలివేటెడ్ కారిడార్ల టెండర్ల ప్రక్రియలో సీఈ హోదాలో ఉండటంతోపాటు.. ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లపాటు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చే విషయంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. అలాగే తరచూ జరిగే ఓఆర్ఆర్ నిర్మాణ, మరమ్మతుల్లోనూ చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి.

**మరో మూడు లాకర్లు తెరిస్తే..**

రవీందర్‌తోపాటు ఆయన కుటుంబసభ్యుల పేరిట మొత్తం నాలుగు లాకర్లున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మంగళవారం సోదాల సమయంలోనే రవీందర్ పేరిట ఉన్న లాకర్‌ను తెరవగా దాదాపు కిలోకుపైగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. ఆయన భార్య, కొడుకు, కోడలు పేరిట ఉన్న మరో మూడు లాకర్లను ఒకట్రెండు రోజుల్లో తెరవనున్నారు. అవి కూడా బయటపడితే రవీందర్ ఆస్తుల విలువ మరింత పెరుగుతుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఏసీబీ గుర్తించిన ఆస్తులు ఇలా..**

నార్సింగి, నానక్‌రాంగూడల్లో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు రెసిడెన్షియల్ ఫ్లాట్లు

కొండకల్, కిష్టాపూర్, పసుమాములల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ప్లాట్లు.

శంషాబాద్, కొత్తూరు మండలాల్లో రూ.6 లక్షల విలువైన 4 ఎకరాల వ్యవసాయ భూములు.

శంకర్‌పల్లి మండలం మోకిలలోని శ్రీవారి మెడోస్‌లో 300 చదరపు గజాల్లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రూ.1.33 కోట్ల విలువైన విల్లా.

కొండాపూర్ మజీద్‌బండలో 300 చదరపు గజాల్లో జీ ప్లస్ 4 అంతస్తులతో నిర్మించిన సుమారు రూ.3 కోట్ల విలువైన వాణిజ్య భవనం.

రూ.1.16 కోట్ల విలువైన 4 కార్లు.

రూ.3.82 లక్షల నగదు. రూ.45.05 లక్షల బ్యాంకు బ్యాలన్స్.

రూ.36.7 లక్షల విలువైన దాదాపు 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు.

రూ.10 లక్షల విలువైన 12.5 కిలోల వెండి ఆభరణాలు.

రూ.17.24 లక్షల విలువైన గృహోపకరణాలు.

రూ.9.32 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు.

# టీజీఎస్పీడీసీఎల్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

మార్చి 23న ఇచ్చిన తీర్పుపై స్టే కోరుతూ తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఎస్పీడీసీఎల్) దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. తాము 2000 జులై నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించినందున ఆరోజు నుంచి కెపాసిటీ ఛార్జీలు చెల్లించాలని ల్యాంకో కొండపల్లి సంస్థ డిస్కంను కోరగా, 2001 జనవరి నుంచి తమకు విద్యుత్తు సరఫరా జరిగినందున ఆ తేదీ నుంచే ఇస్తామని డిస్కం తెలిపింది. ఈ వివాదంపై ల్యాంకో కొండపల్లి సంస్థ సీఈఆర్‌సీని ఆశ్రయించగా అక్కడ ఆ సంస్థకు అనుకూలంగా తీర్పువచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. సీఈఆర్‌సీ ఇచ్చిన తీర్పు తమపై తీవ్ర ఆర్థికభారాన్ని మోపే ప్రమాదం ఉన్నందున దానిపై తక్షణం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరింది. అందుకు అప్పిలేట్ ట్రైబ్యునల్ నిరాకరిస్తూ జులై 6న ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్ మార్చిలో తీర్పు ఇస్తే రెండు నెలలు ఆలస్యంగా మేలో తమను ఆశ్రయించడాన్ని ట్రైబ్యునల్ తప్పుపట్టింది. దీనిపై టీజీఎస్పీడీసీఎల్ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన ఎస్ఎల్‌పీపై మంగళవారం జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ ధర్మాసనం విచారణ జరిపింది. సీఈఆర్‌సీ తీర్పుపై స్టే ఇవ్వాలని డిస్కం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. "మీరు సీఈఆర్‌సీ తీర్పు వచ్చిన 2 నెలల తర్వాత అప్పీల్ దాఖలుచేసి అత్యవసరం అంటున్నారు. మీకు నిజంగా అత్యవసరమైతే వేగంగా స్పందించి ఉండాల్సింది. చివరి నిమిషంలో మేల్కొని హడావుడి చేయడం, మధ్యంతర ఉత్తర్వులు జారీచేయమని కోరడం సరికాదు. మీరు రెండు నెలలు ఆలస్యంగా అప్పీల్ దాఖలుచేయడానికి కారణమేంటి" అని జస్టిస్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ట్రైబ్యునల్ ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించారు. అత్యవసరంగా విచారించమని ట్రైబ్యునల్‌నే కోరాలని సూచించారు. సదరన్ డిస్కం తరఫు సీనియర్ అడ్వొకేట్ గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ... ఇప్పుడు ల్యాంకో కొండపల్లి సంస్థ లిక్విడేషన్‌కు వెళ్తోందని, అప్పుడు తాము చెల్లించే రూ.130 కోట్లు మరో సంస్థకు వెళ్తాయని పేర్కొన్నారు. మరోవైపు ఆ సంస్థకు బకాయిలు చెల్లించకపోతే విద్యుత్తు కొనుగోలు చేయలేమన్నారు. తాము దాఖలుచేసిన స్టే అప్లికేషన్ లోతుల్లోకి వెళ్లకుండానే.. మీరు మొదట రూ.130 కోట్లు చెల్లించాలని అప్పిలేట్ ట్రైబ్యునల్ తమను ఆదేశించిందన్నారు. అందువల్ల సీఈఆర్‌సీ తీర్పుపై వారం రోజులు స్టే ఇస్తే తాము అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను మరోసారి ఆశ్రయిస్తామని విజ్ఞప్తిచేశారు. అందుకు జస్టిస్ సంజయ్‌కుమార్ నిరాకరించారు. మళ్లీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌నే ఆశ్రయించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు. అక్కడ దాఖలుచేసిన స్టే అప్లికేషన్‌పై వేగంగా విచారణ జరపడానికి ఈ నిర్ణయం అడ్డంకి కాబోదని స్పష్టంచేశారు. కావాలంటే తాజా స్టే అప్లికేషన్‌ను దాఖలు చేసుకోవచ్చని స్వేచ్ఛనిచ్చారు. అంతవరకూ కనీసం రెండు రోజుల స్టే అయినా ఇవ్వాలని న్యాయవాది చేసిన విజ్ఞప్తిని జస్టిస్ సంజయ్‌కుమార్ తోసిపుచ్చారు.

# ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు" అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్థంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చన్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది. ఈ క్రమంలో, ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న నాటో సభ్యదేశం పోలండ్ నుంచి మోదీ పాత్రపై ఈ స్థాయిలో ప్రశంసలు రావడం అంతర్జాతీయంగా భారత్ దౌత్య ప్రాముఖ్యతను చాటుతోంది.

# సింగరేణిని నష్టాల ఊబిలోకి నెట్టారు

- మొదటి పేజి తరువాయి

మంగళవారం 'సింగరేణి భరోసా యాత్ర'లో భాగంగా మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కిషన్‌రెడ్డితోపాటు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం పర్యటించింది. శ్రీరాంపూర్, క్యాతనపల్లి, మంచిర్యాల, గోదావరిఖని, మల్హర్‌లలో ఏర్పాటు చేసిన సభలు, కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ.. 'రెండు ప్రభుత్వాలు సంస్థ బొగ్గును వినియోగించుకున్నా రావాల్సిన బకాయిలు ఇప్పించలేకపోయాయి. దీంతో కార్మికులకు వేతనాలు చెల్లించడానికి సింగరేణి ప్రతి నెలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నైనీ బొగ్గు బ్లాకును కేంద్రం సింగరేణికి కేటాయిస్తే.. అప్పటి సీఎం కేసీఆర్ ఏనాడూ అక్కడి ప్రభుత్వంతో మాట్లాడింది లేదు. ఒడిశాలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత నైనీ పనులు వేగవంతం చేయించాం. ఇప్పుడు ఆ అభివృద్ధి పనుల టెండర్ల కోసం రాష్ట్ర మంత్రులు కుమ్ములాడుకుంటున్నారు. సింగరేణి అంటే తెలంగాణకు గౌరవం.. కార్మికుల ఆత్మగౌరవం. అందుకే కార్మికులంతా జెండాలు పక్కన పెట్టి సింగరేణిని రక్షించేందుకు నడుం బిగించాలి' అని పేర్కొన్నారు.

**దోపిడీ, అక్రమాలకు నిలయంగా..**

'కేంద్ర మంత్రిగా తెలంగాణ భవిష్యత్తు ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీతో మాట్లాడి తాడిచర్ల గని కేటాయింపునకు చొరవ తీసుకున్నా. ఈ బాహుబలి గని నుంచి 40-50 ఏళ్ల వరకు బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. దాదాపు 7 వేల మందికి ఉపాధి లభిస్తుంది. భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థ అన్ని రకాలుగా దోపిడీ, కమీషన్లు, అక్రమాలలో కూరుకుపోయింది. భారాస హయాంలో రూ.26 వేల కోట్లు సింగరేణికి కేసీఆర్ అప్పు పెట్టారు. రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంస్థను నిర్లక్ష్యం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి టోకు వ్యాపారం చేస్తుండగా, ఆయన ఎమ్మెల్యేలు చిల్లర వ్యాపారం చేస్తూ సింగరేణిని నష్టాల్లోకి నెట్టారు. సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.60వేల కోట్లు ఇవ్వడం లేదు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 118 బ్లాక్‌లకు అనుమతి ఇస్తే రూ.2.60 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయి. మోదీ నేతృత్వంలోని మా ప్రభుత్వం 12 ఏళ్లుగా నీతిమంతమైన పాలన అందిస్తోంది' అని తెలిపారు.

**మాట విస్మరిస్తున్న రెండు పార్టీలు**

భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. 'ఇచ్చిన మాటల్ని విస్మరించడంలో కాంగ్రెస్, భారాస ప్రభుత్వాలు ఒకే తరహాలో పోటీపడుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి అవినీతికి పెద్దపీట వేస్తోంది' అని ధ్వజమెత్తారు. శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెలా రూ.వెయ్యి కోట్లు ఈ ప్రభుత్వం లూటీ చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు ఈటల రాజేందర్, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నేతలు రఘునాథరావు, వెంకటేశ్ నేత, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్

- మొదటి పేజి తరువాయి

గత ఐదున్నర నెలలుగా అహర్నిశలు సాగిన దర్యాప్తులో సిట్ సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువురు పోలీసు మాజీ అధికారులు, రాజకీయ నేతలపై పక్కా సాక్ష్యాలతో తుది చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ కేసు నిందితుల జాబితాలో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల్ని చేర్చినట్లు గతంలో ప్రచారం జరిగింది. పక్క రాష్ట్రానికి చెందిన బ్యూరోక్రాట్‌ను సిట్ విచారించడం ఇదే మొదటిసారి. ఈ కేసు దర్యాప్తు ముగింపునకు చేరుకుంటున్నట్లు సమాచారం. అనుబంధ అభియోగ పత్రం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి: ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేవలం 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందని, ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందని చెప్పారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ సమయం సరిపోదని... ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. 4,500 పోలింగ్ స్టేషన్లలో ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు (దీూా) ఇళ్లకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ క్యాడర్ చురుకుగా పని చేయాలని సూచించారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావనే ప్రచారం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపుపై ఈసీ నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఉత్కంఠగా మారింది.

# సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు..

## క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో నమోదు
- ఇది సాధారణ తప్పిదమేనని స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- కొడంగల్‌లో ఓటును ఉంచి, అచ్చంపేటలో తొలగించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా దీన్ని సరిదిద్దుతున్నామన్న అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు వేర్వేరు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఉండటంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇది ఓటర్ల జాబితాలో దొర్లిన సాధారణ సాంకేతిక లోపమేనని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో భాగంగా దీనిని సరిదిద్దుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక 'ఫ్యాక్ట్‌చెక్ తెలంగాణ' తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటన విడుదల చేసింది.
కొడంగల్, అచ్చంపేట (కొండారెడ్డిపల్లి) నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో ముఖ్యమంత్రి పేరు (ఎపిక్ నెం: ూజూ0274035) ఉన్నప్పటికీ, ఆయన రెండు చోట్ల ఓటు వేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఓటును కొనసాగించాలని, కొండారెడ్డిపల్లి జాబితా నుంచి పేరును తొలగించాలని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇప్పటికే ఎన్నికల అధికారులకు విన్నవించారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని నివాసం లేదా వృత్తిరీత్యా ప్రాంతాలు మారినప్పుడు రికార్డులు సకాలంలో అప్‌డేట్ కాకపోవడం, పరిపాలనాపరమైన పరిమితుల వల్ల ఇటువంటి ద్వంద్వ నమోదులు జరుగుతుంటాయని అధికారులు వివరించారు. 'ఒక వ్యక్తి – ఒక ఓటు' అనే సూత్రాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో ఎలాంటి ఉద్దేశపూర్వక తప్పిదం లేదని, ఇది సాధారణంగా జరిగేదేనని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.








## ఎన్యూమరేషన్ ఫారం ఇస్తేనే ఓటు హక్కు

### తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి

**హైదరాబాద్ పెన్ పవర్:** పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్వోలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని, లేకుంటే ఓటు హక్కులను తొలగించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బీఎల్వోలకు వెంటనే అందజేసి మీ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఎల్ఓలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, పాస్

-4 లో

## నిర్మాణ అనుమతుల రద్దును సవాల్ చేస్తూ హైకోర్టుకు ప్రదీప్ కన్స్ట్రక్షన్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ భాగస్వామి ప్రదీప్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నిర్మాణ అనుమతుల రద్దును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రద్దు నోటీసులపై స్టే ఇవ్వాలని కోర్టును ప్రదీప్ రెడ్డి కోరారు. నెక్లెస్ రోడ్,సోమాజిగూడలో హైరైజ్ ప్రాజెక్టుకు గతంలో జీహెచ్ఎంసీ ఇచ్చిన అనుమతులు రద్దు చేశారని ఆయన తన పిటిషన్?లో పేర్కొన్నారు. ఏళ్ల తర్వాత అనుమతులు రద్దు చేయడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. చట్టబద్ధత లేని హైడ్రా.. నిర్మాణ వ్యవహారంలో జోక్యం చేసుకుందని ఆరోపించారు. తుది న్యాయపరమైన నిర్ణయం వచ్చే వరకు నోటీసులను నిలిపివేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు. భూమి విక్రయించిన వారిని కూడా ప్రతివాదులుగా చేర్చుతూ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు ఈ కేసును విచారించనుంది.

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

- కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య వివాదం
- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరా జన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

## హైదరాబాద్‌లో బ్రిక్స్ సదస్సు..

### ఉద్యోగ భద్రతపై మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు

- హైదరాబాద్‌లో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు
- ఉద్యోగ భద్రత ఉంటేనే ఉత్పాదకత పెరుగుతుందన్న మంత్రి వివేక్
- పదేళ్లలో 17 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని తెలిపిన కేంద్ర మంత్రి మాండవీయ
- భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సమావేశాలు
- 14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధులు హాజరు




**హైదరాబాద్ పెన్ పవర్:** కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే వారి నుంచి మెరుగైన ఉత్పాదకతను సాధించగలమని తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు సామాజిక భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్ - 2026 ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ ప్రసంగించారు. జులై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా సహా 14 దేశాల నుంచి దాదాపు 110 మంది ప్రతినిధులు హాజరయ్యారు.కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల

-4 లో

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణమన్న పొన్నం ప్రభాకర్
- మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శ
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఎన్యూమరేషన్ ఫామ్స్ తిరిగివ్వని 50 శాతం ఓటర్లు

**రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాలను 49.2శాతం మంది ఓటర్లు మాత్రమే బీఎల్ఓలకు అందజేశారు.**




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఎస్ఐఆర్ కొనసాగుతోంది. అయితే మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు గాను 3,38,21,554 మందికి(99.99శాతం)ఎన్నికల అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. కానీ తిరిగి బీఎల్ఓలకు అందజేసే కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 1,66,70,610మంది ఓటర్లు మాత్రమే (49.28శాతం) తమ ఫారాలను అందజేశారు. దీంతో మరో 50శాతం మంది ఓటర్లు పది రోజుల్లో ఇవ్వడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పెంచాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**49.2 శాతం మాత్రమే..**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాలను 49.2శాతం మంది ఓటర్లు మాత్రమే బీఎల్ఓలకు అందజేశారు. కొమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో మాత్రమే 70శాతానికిపైగా ఓటర్లు తిరిగి ఫారాలను అందజేశారు. నిర్మల్, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, జోగులాంబ గద్వాల, జనగాం, ఖమ్మం, నారాయణపేట్ జిల్లాల్లో 60శాతానికిపైగా మంది ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 33శాతం, హైదరాబాద్ జిల్లా 22 శాతం, అత్యల్పంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 18శాతం మంది మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేశారు. అయితే ఇప్పటివరకు వచ్చిన ఫారాల్లో మరణించిన ఓట్లు, వేరేప్రాంతాలకు చెందిన ఓటర్లు మాత్రమే అందజేసినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన ఓటర్లు ఓటెయ్యడంలోనూ, ఓటును కాపాడుకోవడంలోనూ వెనుకబడే ఉన్నారని విమర్శలూ లేకపోలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో 14రోజుల పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రంలో పొడిగించే అవకాశాలు ఉన్నాయా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

# రూ. 60 వేల కోట్లతో అమెజాన్ పెట్టుబడి




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రోజురోజుకూ ఏఐ ప్రాబల్యం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో తెలంగాణలోనే డేటా సెంటర్ల ఏర్పాటుకు బహుళజాతి కంపెనీలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయి. 2025 జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో సీఎం రేవంత్‌రెడ్డి అమెజాన్ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు. సమావేశంలో రాష్ట్రంలో డేటా సెంటర్ల విస్తరణ కోసం రూ.60 వేల కోట్ల పెట్టుబడికి అమెజాన్ సంస్థ ప్రతినిధులను సూచనప్రాయంగా ఒప్పించారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద టెక్నాలజీ పెట్టుబడుల్లో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత 2025 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా అమెజాన్‌తో ఈ రూ.60 వేల కోట్ల పెట్టుబడికి సంబంధించిన ఫ్రేమ్ వర్క్ అగ్రిమెంట్ చేసుకున్నారు.

**202 ఎకరాల స్థలం కేటాయింపు..**

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు భారత ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలు అమెజాన్ సంస్థకు కేటాయించారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుతో అమెజాన్ సంస్థ దేశంలోనే అతి పెద్ద హైపర్ స్కేల్ డేటా సెంటర్‌లలో ఒకటిగా హైదరాబాద్ నిలవనుంది. అదేవిధంగా రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్ సంస్థకు అందజేశారు. పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్) ప్రాంత అభివృద్ధికి ఈ డేటా సెంటర్ అత్యంత కీలకం కానుంది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. రాబోయే 10 ఏండ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. మొత్తంగా రానున్న పదేండ్లలో రూ.60 వేల కోట్ల పనులు డేటా సెంటర్ ఏర్పాటుకు దోహదపడే అవకాశం ఉన్నది.

**రాష్ట్ర ఐటీ రంగంలో మరో మైలురాయి..**

హైదరాబాద్‌ను దేశంలోనే అతిపెద్ద డిజిటల్, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ భారీ అడుగులు వేస్తున్నది. సీఎం రేవంత్ శంకుస్థాపన చేసే అమెజాన్ డేటా సెంటర్ ప్రాజెక్టు తెలంగాణ ఐటీ రంగంలో మరో మైలురాయిగా నిలవనుంది. అమెజాన్‌కు చెందిన క్లౌడ్ కంప్యూటింగ్ విభాగం ఇప్పటికే హైదరాబాద్‌లో తన సేవలను విస్తరిస్తూ అడుగులు వేస్తున్నది. ముంబై తర్వాత దేశంలో రెండో క్లౌడ్ రీజియన్‌ను ఇక్కడే ఏర్పాటు చేయనుంది. ఈ పెట్టుబడితో హైదరాబాద్‌లో అత్యాధునిక హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. వీటి ద్వారా క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్,

ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో భూమి, నీరు, విద్యుత్, రహదారుల, విధానపరమైన సహకారం, వేగవంతమైన పరిపాలన వంటి అనుకూలతలు ఉండటంతో కార్పొరేట్ కంపెనీలు ప్రస్తుతం నగరం వైపు మొగ్గు చూపుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

# రష్యాకు చెక్

**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా నుంచి పెరుగుతున్న బాలిస్టిక్ క్షిపణుల ముప్పును ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్‌తో పాటు మరో తొమ్మిది యూరప్ దేశాలు కొత్త కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించాయి. గత నాలుగేళ్లకు పైగా రష్యా పూర్తి స్థాయి దాడిని తట్టుకుని పోరాడిన ఉక్రెయిన్ అనుభవాన్ని వినియోగించుకుని యూరప్‌కు ఉమ్మడి బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించాయి. పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన సమావేశంలో డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, స్వీడన్, బ్రిటన్ నాయకులు ఈ ప్రకటన చేశారు."యూరప్‌కు ఉమ్మడి బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని నిర్మించడమే మా లక్ష్యం" అని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే క్షిపణి ముప్పును అడ్డుకోవాలంటే సమగ్ర, సమన్వయంతో కూడిన క్షిపణి రక్షణ వ్యవస్థ అవసరమని వారు అభిప్రాయపడ్డారు. రష్యా దాడులను ఎదుర్కొంటూ ఉక్రెయిన్ సంపాదించిన అనుభవం ఈ ప్రణాళికకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ రక్షణ వ్యవస్థ ఎప్పటిలోగా సిద్ధమవుతుందన్న దానిపై గడువు ప్రకటించలేదు. ఇతర దేశాలు కూడా ఈ కూటమిలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

**ఏడాదిలో కొత్త వ్యవస్థ లక్ష్యం...**

తమ భాగస్వామ్య దేశాలతో కలిసి వచ్చే 12 నెలల్లో తక్కువ ఖర్చుతో భారీ స్థాయిలో తయారు చేయగల క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసే అవకాశం ఉందని జెలెన్‌స్కీ చెప్పారు. దీని వల్ల యూరప్ తన అవసరాలకు తానే క్షిపణి నిరోధక వ్యవస్థలను తయారు చేసుకోవడంతో పాటు అవసరమైన ఇతర దేశాలకు కూడా అందించగలదని వివరించారు. శీతాకాలం ప్రారంభమయ్యేలోపు వైమానిక రక్షణను మరింత బలోపేతం చేయాలని ఉక్రెయిన్ ప్రయత్నిస్తోంది. ప్రతి శీతాకాలంలో రష్యా విద్యుత్, తాగునీరు, తాపన వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు పెంచుతుందని జెలెన్‌స్కీ చెప్పారు. పారిస్ సమావేశంలో ఉక్రెయిన్ ప్రతినిధులు ప్రతిపాదిత యాంటీ-బాలిస్టిక్ కార్యక్రమాన్ని ప్రభుత్వాధినేతలు, జాతీయ భద్రత సలహాదారులు, రక్షణ సంస్థల ప్రతినిధులకు వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం ఉక్రెయిన్‌కు పేట్రియట్ వైమానిక రక్షణ వ్యవస్థలను దేశంలోనే తయారు చేసుకునే లైసెన్స్ ఇస్తామని ప్రకటించారు. ఇది ఉక్రెయిన్‌కు కీలక ముందడుగుగా భావిస్తున్నప్పటికీ, ఆ ప్రణాళిక అమల్లోకి రావడానికి ఇంకా ఏళ్ల సమయం పట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. యూరప్ ప్రతిపాదిస్తున్న కొత్త వ్యవస్థ ఎంత త్వరగా సిద్ధమవుతుందో ఇంకా స్పష్టత లేదు.

**వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న పుతిన్...**

ఇటీవల ఉక్రెయిన్ రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలు, ట్యాంకర్లు, ఇంధన టెర్మినళ్లపై దీర్ఘశ్రేణి దాడులు చేసింది. వీటి వల్ల పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఏర్పడింది. దీనిపై స్పందించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గట్టి ప్రతీకారం తప్పదని హెచ్చరించారు."రష్యా భూభాగాన్ని ఎక్కడ లక్ష్యంగా చేసుకున్నా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తాం. అయితే మా దాడులు మరింత శక్తివంతంగా ఉంటాయి" అని క్రెమ్లిన్ అనుకూల కార్యకర్తల సమావేశంలో చెప్పారు. ఇదే సమయంలో బ్రస్సెల్స్‌లో సమావేశమైన యూరప్ విదేశాంగ మంత్రులు ఉక్రెయిన్ అవసరాలు, యూరప్‌కు రష్యా నుంచి ఎదురవుతున్న ముప్పుపై చర్చించారు.

**చర్చలకు రష్యాను ఒప్పించాలని ...**

ఉక్రెయిన్ తాజా విజయాలను ఆసరాగా తీసుకుని యుద్ధానికి ముగింపు పలికే చర్చల బల్లపై పుతిన్‌ను తీసుకురావాలని ఉక్రెయిన్, దాని యూరప్ భాగస్వాములు భావిస్తున్నారు. అయితే అమెరికా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నా రాజీకి సిద్ధమన్న సంకేతాలు మాస్కో నుంచి కనిపించడం లేదు. పారిస్ సమావేశాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తక్కువ చేసి మాట్లాడారు."ఇది యుద్ధాన్ని ప్రోత్సహించే దేశాల కూటమి. రష్యాకు వ్యూహాత్మక పరాజయం కలిగించవచ్చన్న భ్రమలో ఉన్నవారి సమూహం" అని వ్యాఖ్యానించారు.

**డ్రోన్ దాడులతో రష్యాపై ఒత్తిడి...**

డ్రోన్ సాంకేతికతలో సాధించిన పురోగతితో ఉక్రెయిన్ ఇటీవల పైచేయి సాధించిందని పశ్చిమ దేశాల అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు. ముందుబాటుకు వెనుకనున్న సరఫరా మార్గాలపై దాడులు చేయడంతో రష్యా సైన్యానికి ఇబ్బందులు పెరిగి, ముందుకు సాగడం నెమ్మదించిందని వారు విశ్లేషిస్తున్నారు. జూలై 6 నుంచి 13 మధ్య అజోవ్ సముద్రంలో క్రిమియా సమీపంలో రష్యాకు చెందిన 105 నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఉక్రెయిన్ మానవరహిత వ్యవస్థల దళాల కమాండర్ రాబర్ట్ బ్రోవ్డీ తెలిపారు. వీటిలో ట్యాంకర్లు, సరకు నౌకలు, ఫెర్రీ, టగ్‌బోట్లు ఉన్నాయని చెప్పారు. ఈ వివరాలను స్వతంత్రంగా నిర్ధారించడం సాధ్యం కాలేదు. రష్యా కూడా వెంటనే స్పందించలేదు.

**మోల్డోవాలో పడిన డ్రోన్...**

ఒడెసా ప్రాంతంపై రష్యా రాత్రిపూట జరిపిన దాడుల సమయంలో ప్రయోగించిన ఒక డ్రోన్ మోల్డోవా భూభాగంలో కూలి పేలిందని ఆ దేశ విదేశాంగ శాఖ తెలిపింది. దీనిని తీవ్రంగా ఖండించింది. మరోవైపు రష్యా వైపు దూసుకొచ్చిన 350 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. వాటిలో 50 డ్రోన్లు రాజధాని సమీపంలోనే కూల్చివేశామని చెప్పారు. మాస్కో ప్రాంత గవర్నర్ ఆండ్రే వోరోబ్యోవ్ ప్రకారం, రాత్రి జరిగిన దాడిలో 81 డ్రోన్లను అడ్డుకున్నారు. పియోనెర్స్కి ప్రాంతంలో ముగ్గురు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అదే సమయంలో రష్యా ఉక్రెయిన్‌పై 134 దీర్ఘశ్రేణి డ్రోన్లు, మూడు మార్గనిర్దేశిత క్షిపణులు ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఒడెసా పోర్టు మౌలిక సదుపాయాలపై జరిగిన దాడిలో టోగో జెండాతో ఎరువులు తీసుకెళ్తున్న ఓ వాణిజ్య నౌకకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు సిబ్బంది మరణించగా, మరో పది మంది గాయపడ్డారని ప్రాంతీయ సైనిక పరిపాలన అధికారి ఒలెహ్ కిపర్ వెల్లడించారు.

**డ్రోన్ దాడి కుట్ర భగ్నమైందన్న రష్యా...**

దూర తూర్పు అమూర్ ప్రాంతంలోని ఉక్రైన్కా వైమానిక స్థావరం, దక్షిణ యూరల్స్‌లోని షాగోల్ వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి కుట్ర పన్నిందని రష్యా ఫెడరల్ భద్రతా సంస్థ తెలిపింది. చిన్న డ్రోన్లను గాలి బెలూన్ల సాయంతో బ్రయాన్స్క్ ప్రాంతంలోకి తరలించి, పెద్ద రవాణా డ్రోన్లను కార్లలో వైమానిక స్థావరాల సమీపానికి తీసుకెళ్లారని పేర్కొంది. ఈ కుట్రలో పాల్గొన్న ఉక్రెయిన్ ఏజెంట్లను అరెస్టు చేశామని వెల్లడించింది. గత ఏడాది ఉక్రెయిన్ నిర్వహించిన "ఆపరేషన్ స్పైడర్‌వెబ్"లో రహస్యంగా రష్యాలోకి తరలించిన డ్రోన్లతో మాస్కో వ్యూహాత్మక బాంబర్ విమానాల దళంలో దాదాపు మూడో వంతు దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్ అధికారులు అప్పట్లో ప్రకటించారు.

## ఎన్యూమరేషన్ ఫారం ఇస్తేనే ఓటు హక్కు

-3 పేజి తరువాయి

ఫోర్ట్ సైజు ఫొటోను అతికించి బీఎల్ఓలకు అందించాలని ఆయన కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బీఎల్ఓల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బీఎల్వోలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్వోలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బీఎల్ఓలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది (49.28శాతం) ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారని తెలిపారు. సర్ ప్రక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఈరోజే బీఎల్వోలకు అందజేయాలని సూచించారు.

## హైదరాబాద్‌లో బ్రిక్స్ సదస్సు..

### ఉద్యోగ భద్రతపై మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు

-3 పేజి తరువాయి

కాలంలో భారత్‌లో సుమారు 17 కోట్ల ఉద్యోగాలను సృష్టించామని, 2017లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించారు. ఇదే సమయంలో మహిళ ఉపాధి రేటు 22 శాతం నుంచి 38.8 శాతానికి వృద్ధి చెందిందని వివరించారు.


రాబోయే రెండేళ్లలో వ్యవస్థీకృత రంగంలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రవేశపెట్టినట్లు మాండవీయ తెలిపారు. మరోవైపు, తెలంగాణలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని మంత్రి వివేక్ వెల్లడించారు. టామ్‌కామ్ ద్వారా జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని ఆయన వివరించారు.

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

-3 పేజి తరువాయి

వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

## రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి : కలెక్టర్ కె. హరిత




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటి అవసరం గల ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు ముందస్తు ప్రణాళికతో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. బోరుబావుల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు కూడా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, కంది వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు. జూలై 31 వరకు కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగితే, ఆగస్టు మొదటి వారంలో కందులు, ఉలవలు, అలసందలు, ఆముదం, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల విత్తనాలను విత్తుకోవడం రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని, దీంతో నష్టాల నుంచి రైతులు బయటపడే అవకాశం ఉంటుందని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్‌లో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లను లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. అలాగే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ పద్మనాభం: కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:** పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ అని అభివర్ణించారు. కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు. కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు ముద్రగడ పద్మనాభం మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తెలుసుకున్న బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో కాపు ఉద్యమం గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యం కోసం దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడి కేంద్రంగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలందించారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, అధికారానికి దూరంగా ఉన్న సమయంలో కూడా ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు, సముచిత గుర్తింపు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రభావం చూపాయి. కాపు సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముద్రగడ కీలక పాత్ర పోషించారు. తన డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమానికి కొత్త ఊపును తీసుకువచ్చారు.

# శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు ఉపయోగపడుతుంది

**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:** ఉపాధ్యాయులకు శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు ఉపయోగతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కాటారం, మొగుళ్లపల్లి, మహముత్తారాం, భూపాలపల్లి మండలాల జడ్పి, కెజిబివి, మోడల్ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ ఇస్తున్న
ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ టు ట్రాన్స్ నేటివ్ క్లాస్ రూమ్స్
శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం అయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఆధునిక సాంకేతికతను అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించే దిశగా బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను సరైన దిశలో నడిపిస్తూ, భావి భారతానికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ముఖ్య బాధ్యత అని తెలిపారు. విద్యాబోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కీలకమైందని, దీని ద్వారా బోధనలో నాణ్యత పెరిగి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు పెరిగి మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 6 పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించామని, త్వరలో మరిన్ని పాఠశాలలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. గుణాత్మక విద్య సామర్థ్యవంతమైన ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపు
ఆధునిక బోధనా పద్ధతులు, సరికొత్త అధ్యాపన విధానాలు, తరగతి నిర్వహణపై శిక్షణ అవసరమని తెలిపారు. శిక్షణ సృజనాత్మక మరియు నాణ్యమైన బోధనకు మార్గదర్శనమని తెలిపారు విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మైనారిటీ సంక్షేమ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయి అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, ఎఎంఓ విజయ్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## చాప కింద నీరులా అవినీతి చేపలు
## - పెద్దపల్లిలో దొరికిన మున్సిపల్ ఏఈ సతీష్ కుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ గా పని చేస్తున్న సతీష్ లంచం తీసుకుంటుండ గా మంగళవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్ళితే ఓ కాంట్రాక్టర్ బిల్లు చెల్లించే విషయంలో సదరు అధికారి రూ. 2 లక్షలు డిమాండ్ చేయగా, బాధితు డు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన వారు సదరు కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండ గా ఏఈ కల్లేపల్లి సతీష్ కుమార్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని రూ.2 లక్షలు నగదును స్వాధీనం చేసుకు న్నారు. అ నంతరం అతని నివాసంలో సోదాలు నిర్వహిం చారు. ఈ సోదాల్లో సుమారు రూ.32,31,900 విలువైన లెక్కల్లో చూపని నగదు లభ్యమైనట్లు వెల్లడించారు. ఈ నగదును స్వాధీనం చేసుకుని విచారణలో భాగంగా స్వాధీనం పరచిన ట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, తీసుకున్న వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డిఎస్ పీ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం పోలీస్ కమిషనర్

**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ-01 పరిధిలోని ఓసీపీ-05 వద్ద రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( ఎంపీడీవో) కు ఘన సన్మానశీ...

**ఇల్లందకుంట దేవస్థానం ఛైర్మన్ ఇంగిలే రామారావు..**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ఇల్లందకుంట మండలానికి నూతనంగా వచ్చి బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో విజయ్ కుమార్, ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఛైర్మన్ ఇంగిలే రామారావు, మంగళవారం నాడు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. దేవుని మేమంటో, ముత్యాల తలంబ్రాలు, అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ,తో మాట్లాడుతూ మండల అభివృద్ధి, గ్రామాల పురోగతి ఇల్లంధకుంట మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం చేసే కృషిలో,గ్రామాల అభివృద్ధిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అదించడంలో వారి పదవికాలం విజయవంతం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గొడిశాల పరమేష్, డిసిసి కార్యదర్శి మేకమల్ల అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉప్పుల అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

### 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తాడిచర్ల బ్లాక్-2 ను సింగరేణికి కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి నాయకుల కృతజ్ఞతలు తెలిపారు.
సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి-5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని,12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్-2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి , కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ రావుపేటలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** రామడుగు మండలం గోపాలరావుపేట్ గ్రామంలో మంగళవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు సీపేల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ హాజరై టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ కవితక్క నాయకత్వంలో ప్రజలకు ఉచిత విద్య ఉచిత వైద్యం రైతే రాజు నియామకాలు సామాజిక తెలంగాణనే లక్ష్యంగా పాంచ జన్య పథకాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల కోసం నిరంతరం బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసే ఏకైక నాయకురాలు ఎవరైనా ఉన్నారంటే అది కవితక్క అని అన్నారు. బీసీ నినాదాన్ని ఎత్తుకున్న నాయకురాలు కవితక్క అని వారు అన్నారు. రేపు కవితక్క పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం లోకి వస్తే సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వారు అన్నారు. ఈనెల 20వ తారీకున రామగుండంలోని సింగరేణి కార్మికుల కోసం కవితక్క తలపెట్టే నిరాహార దీక్షలో తెలంగాణ రక్షణ సేన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంజపడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జి ఉజిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి సీనియర్ నాయకులు గుండేటి తిరుపతి పిట్టల సత్యం గాలి పెల్లి రత్నాకర చారి బీసీ విభాగశీ అధ్యక్షులు శ్రీరాముల రమేష్ ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్ సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్ సీనియర్ నాయకులు బుడిగె పరుశు రాం గౌడ్ బాసవేణి రాజేందర్ రవి శంకర్ బాబు రాజు శ్రీకాంత్ రవి శంకరయ్య స్వామి మదు తిరుపతి శేఖర్ రాజు రాజు మల్లయ్య సుదాకర్ మధు మహిళా నాయకురాలు ధ్యావ శారద తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రైతులకు సక్రమంగా యూరియా సరఫరా చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ...**

**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:**
జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ బోర్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియా సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవడంపై అవగాహన ఉందా అని అడిగి తెలుసుకున్నారు. యూరియా కు ప్రత్యామ్నయంగా నానో యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. గత ఏడాది జూలై 14వ తేదీ నాటికి ఎంత యూరియా కేటాయించారు, వినియోగం ఎంత జరిగిందో నివేదికలు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రామగుండం ప్రాంతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ--రెవెన్యూ కు సంబంధించిన సర్వేను పరిశీలించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేసి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులు అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నుంచి పనుల అమలు వరకు ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ--రెవెన్యూ సరిహద్దు సర్వేను పరిశీలించిన కలెక్టర్, రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులు
సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని ఆదేశించారు. సంబంధిత రికార్డుల ఆధారంగా పారదర్శకంగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో డీఈ (పంచాయతీరాజ్) నాయుడు, ఏఈ (పంచాయతీరాజ్) రాజ్‌కుమార్, పెద్దపల్లి అటవీ పరిధి అధికారి (ఎఫ్ఆర్ఓ) టి. సతీష్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం: తపస్ ధర్నాకు బీజేపీ మద్దతు

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తపస్ (టిపియుఎస్) ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, కాలపరిమితితో చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తిరుపతి రావు, ప్రభాకర్ రావు, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి.. ఎన్నికల అధికారిని కలిసిన బీఆర్ఎస్ బృందం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన సమయం సరిపోదని.. ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని.. ఇప్పటికే ఈ విషయం చెప్పినా స్పందన లేదని బీఆర్ఎస్ నేతలు అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని మంగళవారం బీఆర్ఎస్ ఎస్ఐఆర్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కర్నె ప్రభాకర్, ఎల్.రమణ, సుమిత్రానంద్, సతీష్‌రెడ్డి, అభిలాష్ రంగినేని కలిశారు. రాష్ట్రంలో సర్ కార్యక్రమం జరుగుతున్నా.. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదన్నారు. టెక్నికల్‌గానూ కొన్ని అనుమానాలు ఉన్నాయని తెలిపారు.
ఇది వరకే సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారని.. తమ పార్టీ తరపున కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను కలిశామని చెప్పారు. కానీ.. వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అనేక పిటిషన్లు ఉన్నాయని.. వీటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఓటర్ల విషయంలోనూ అనేక చిక్కులు ఉన్నాయని.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కచ్చితంగా గడువు పొడిగించి, ఇచ్చిన పిటిషన్లు పరిష్కరించాలని సూచించారు.

## ప్రేమ వేధింపుల కేసులో ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన యువతి గోషిక మాధవి ఆత్మహత్య కేసులో జైపూర్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గోనె వెంకటేష్‌తో పాటు అతని తల్లి గోనె శంకరమ్మ, అక్క గోనె శైలజలను మంగళవారం అదుపులోకి తీసుకుని పంచనామా నిర్వహించి, నిందితులను కోర్టుకు తరలించినట్లు జైపూర్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై భూమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు గోనె వెంకటేష్ విచారణలో కీలక విషయాలను వెల్లడించినట్లు ఎస్సై భూమేష్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే, సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్న మాధవికి రెండేళ్ల క్రితం వెంకటేష్‌తో పరిచయం ఏర్పడగా, ఆ పరిచయాన్ని ప్రేమగా భావించి, ఆమె అంగీకరించకపోయినా నిరంతరం వెంటపడుతూ పెళ్లి చేసుకోవాలని మాధవిని ఒత్తిడి చేసి వేధించాడు. ఈ విషయాన్ని తన తల్లి శంకరమ్మ, అక్క శైలజకు చెప్పగా, ముగ్గురూ కలిసి యువతి ఇంటికి వెళ్లి పెళ్లి చేయాలని కోరారు. అయితే కులాలు వేరవడంతో యువతి కుటుంబ సభ్యులు నిరాకరించినట్లు తెలిపారు. మాధవితో పెళ్లి చేయకపోతే తన పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానంటూ వెంకటేష్ పలుమార్లు బెదిరించినట్లు వెల్లడైంది. ఈ నెల జూలై 10వ తేదీన గోదావరిఖనిలో మాధవిని కలిసిన వెంకటేష్, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసి, అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు విచారణలో వెల్లడించాడు. జూలై 11న పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలోనూ యువతి కుటుంబం వివాహానికి నిరాకరించడంతో, వెంకటేష్ తల్లి, అక్క కలిసి మా వాడికి ఏదైనా జరిగితే మీదే బాధ్యత అంటూ బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు వెంకటేష్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని డేటా పరిశీలించగా, మాధవికి తరచూ కాల్స్ చేసినట్లు నిందితుడు అంగీకరించాడని, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు పంచనామాలో పేర్కొన్నారు. అనంతరం శంకరమ్మ, శైలజల వాంగ్మూలాలు కూడా నమోదు చేయగా, వారు కూడా ప్రధాన నిందితుడు తెలిపిన వివరాలనే ధృవీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై భూమేష్‌ను సీఐ నవీన్ కుమార్ అభినందించారు.

## సీపీ చేతుల మీదుగా హుజురాబాద్ పోలీసులకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** విధుల పట్ల అంకితభావంతో ఉత్తమ సేవలు అందించిన హుజురాబాద్ పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి అరుదైన గుర్తింపు లభించింది. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి అందించే లిలి"ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు"లిలి హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌కు ప్రదానం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం చేతుల మీదుగా వారు ఈ గుడ్ సర్వీస్ సర్టిఫికెట్లను అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభ, కర్తవ్యనిర్వహణలో అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం అవార్డు గ్రహీతలను అభినందిస్తూ, ఇదే నిబద్ధతతో భవిష్యత్తులోనూ ప్రజలకు సేవలందించి పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌లకు స్థానిక పోలీసు అధికారులు, సహచర సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ఒక్కసారిగా తగ్గిన సల్కం చెరువు విస్తీర్ణం

# దుమారం రేపుతున్న యూ-టర్న్

**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే వినిపించిన 'చట్టం ఎవరికైనా ఒక్కటే' అనే నినాదం ఇప్పుడు పాతబస్తీ సల్కం చెరువు సాక్షిగా అభాసుపాలవుతోంది. పేదల ఇళ్లు, సామాన్య బిల్డర్ల భవనాలపై బుల్డోజర్లతో విరుచుకుపడే 'హైడ్రా' కన్ను, మిత్రపక్షమైన ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీకి చెందిన విద్యాసంస్థల దగ్గరకు వచ్చేసరికి మూతపడిందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. చాంద్రాయణగుట్ట బండ్లగూడ ఖల్సాలోని సల్కం చెరువు పరిధిలో ఉన్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ వివాదంలో తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో తీసుకున్న అనూహ్యమైన యూ-టర్న్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం రాజకీయ ప్రయోజనాల కోసం నిబంధనలను ఎలా తుంగలో తొక్కిందో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.సల్కం చెరువు ఆక్రమణలపై అడ్వకేట్ విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్ వెనుక సుదీర్ఘ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా దాగి ఉంది. 2016 లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ప్రాథమిక సర్వే నోటిఫికేషన్ ప్రకారం.. సల్కం చెరువు వైశాల్యం దాదాపు 36 ఎకరాల ప్రభుత్వ భూమి. అప్పట్లో అధికారికంగా విడుదల చేసిన మ్యాపులు ఈ ఒవైసీ విద్యాసంస్థల భవనాలు స్పష్టంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు తేల్చిచెప్పాయి.కానీ, తాజా విచారణలో ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు సమర్పించిన మెమో చూసి స్వయంగా హైకోర్టే ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ విద్యాసంస్థలు అసలు ట్యాంక్ బెడ్ లేదా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే లేవంటూ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడం, మిషన్ కాకతీయ కింద చెరువు చుట్టూ రింగ్ బండ్ నిర్మించామని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ నీతిని బట్టబయలు చేసింది. 2016 నాటి నోటిఫికేషన్‌కు భిన్నంగా ఇప్పుడు చెరువు వైశాల్యం ఎలా కుంచించుకుపోయింది? రాజకీయ ఒత్తిళ్లతో ఎఫ్‌టీఎల్ సరిహద్దులను మార్చడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తూ ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా శాఖలను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిలదీయడం ప్రభుత్వ వైఖరిని ఎండగడుతోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఎంఐఎం పార్టీతో అంతర్గతంగా నడుపుతున్న ఫ్రెండ్లీ బంధాన్ని కాపాడుకోవడానికే ఈ డిఫెన్సివ్ స్టాండ్ తీసుకున్నారనేది బహిరంగ రహస్యం. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంఐఎం పరోక్ష మద్దతు ఇస్తుండటంతో, పాతబస్తీ పెద్దలను నొప్పించకుండా ఉండేందుకు అధికారులు రీ-సర్వేల పేరుతో కాలయాపన చేసి, చివరకు నివేదికలనే మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఎంతటివారైనా సరే.. చెరువులను ఆక్రమిస్తే వదిలేది లేదు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి బిల్డప్ ఇచ్చిన హైడ్రా బ్రాండ్ ఇమేజ్‌కు ఈ సల్కం చెరువు వ్యవహారం పెద్ద మచ్చగా మారింది. చట్టం అందరికీ ఒక్కటే అన్న సూత్రం అధికార పక్ష రాజకీయ అవసరాలకు లోబడి ఎలా మారిపోతుందో ఈ కేసు రుజువు చేస్తోంది.ప్రభుత్వం తీసుకున్న ఈ పక్షపాత నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకులకు ఉచిత కంటి పరీక్షలు చేయించాలని ఎద్దేవా చేశారు. ఓవైసీ కాలేజీ చెరువులోనే ఉందన్న విషయం ప్రపంచం మొత్తానికి స్పష్టంగా కనిపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించట్లేదని విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చడానికి
వేగంగా వచ్చే హైడ్రా, మిత్రపక్షం అక్రమ నిర్మాణాల దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేస్తోందన్నారు. కాంగ్రెస్ రాజకీయ రంగోలీ వేసిన ప్రతిచోటా ఎఫ్‌టీఎల్ లైన్లు మాయాజాలంతో మారిపోతాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు.ప్రభుత్వం ఓవైసీ విద్యాసంస్థలను కాపాడటానికి ఎన్ని ప్రహసనాలు ఆడినా, న్యాయస్థానం మాత్రం ఈ కేసును తేలికగా వదిలేలా లేదు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఈ కాలేజీకి అసలు అనుమతులు లేవని ఒకసారి, కేవలం ఇతర విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారని మరోసారి పరస్పర విరుద్ధ సమాధానాలు చెప్పడంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణం, సహజ వనరుల రక్షణ ప్రజా ప్రయోజనాలకు
సంబంధించిన అంశమని స్పష్టం చేస్తూ, అన్ని శాఖలు 3 వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ నిబంధనలను తుంగలో తొక్కినా.. న్యాయస్థానం పర్యవేక్షణలో సల్కం చెరువు ఆక్రమణల నిజాలు త్వరలోనే పూర్తిగా బయటకు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# వెనక్కి తగ్గేది లేదంటున్న కవిత

**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పేరును మార్చుకోవాలంటూ.. కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన దరిమిలా.. ఆ పార్టీ చీఫ్ కవిత తాజాగా కేంద్ర ఎన్నికల సంఘానికి సుదీర్ఘ లేఖ రాశారు. తమకు అదే పేరు కావాలని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటి కే రాష్ట్ర వ్యాప్తంగా వంద నియోజకవర్గాలకు పైగా తమ పార్టీ పేరుతో జెండాలు ఎగురవేశామని.. ఇప్పుడు మార్చుకోమంటే ఎలా ? అని కవిత ప్రశ్నించారు. ఈ మేరకు కవిత పేరుతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ లేఖ సంధించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ప్రశ్నలు కూడా సంధించారు. తమ పార్టీ పేరును మార్చు కోవాలని వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని చెబుతున్న ఎన్నికల సంఘం ఆ అభ్యంతరాలను ఎవరు వ్యక్తం చేశారో.. చెప్పాలని కోరారు. ఆ లేఖలను కూడా తమకు పంపాలని పట్టుబట్టారు. ఎవరో ముక్కు మొహం తెలియని వారు రాసిన లేఖలను ఆధారంగా చేసుకుని పార్టీ పేరును మార్చుకోమని కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. పార్టీ పేరు విషయంలో గతంలో కేంద్ర ఎన్నికల సంఘం తమకు కొన్ని సూచనలు చేసిందని.. దాని ప్రకారమే పేరును మార్చుకున్నామని.. తెలంగాణ రక్షణ సేన పేరుతో 105 నియోజకవర్గాల్లో పార్టీ జెండాను కూడా ఆవిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు తమకు అనుకూలంగా ఉన్నారని.. అలాంటప్పుడు పేరును మార్చుకోమని కోరడం సరికాదని తెలిపారు. ఇది తమ హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకే రమమైన పేర్లతో అనేక పార్టీలు తెలంగాణలో ఉన్నాయని కూడా అనిల్ కుమార్ పేర్కొన్నా రు. తమకు మాత్రమే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. తమ వైపు నుంచి కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఆలోచన చేయాలని కోరారు. కాగా.. ఎన్నికల సంఘం సూచించిన గడువు.. సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో పీపుల్ రిప్రజెంటేటివ్ యాక్ట్-1951 సెక్షన్ 29ఏ ప్రకారం.. తమ అభ్యర్థనను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.



# పరుగులు పెడుతున్న బుల్లెట్ ట్రైన్

**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో భాగంగానే ఫ్యూచర్ సిటీ సహా బుల్లెట్ ట్రైన్, మెట్రో వ్యవస్థలను కీలకంగా తీసుకుంది. మెట్రో ను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేసింది. దీనిని విస్తరించే ప్రతిపాదనను కూడా సర్కారు సిద్ధం చేసింది. ఇక, ఫ్యూచర్ సిటీని 14 వేల ఎకరాలకు పరిమితం చేయాలని అనుకున్నా.. ఇప్పుడు దాదాపు మరో 14 వేల ఎకరాలకు విస్తరించనుంది. మరోవైపు బుల్లెట్ రైల్ కారిడార్ ప్రతిపాదనలు కూడా రెడీ అవుతున్నాయి. ఇవన్నీ.. చెప్పుకొనేందుకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఏమేరకు సాకారం అవుతాయన్నది ప్రశ్నగా మారింది. దీనికి కారణం.. భూముల సమస్యే. అటు ఫ్యూచర్ సిటీ కోసం భూ సేకరణ (2013 నాటి చట్టం) చేపట్టాలని నిర్ణయించారు. కానీ, దీనికి అనుకున్న విధంగా ప్రజల నుంచి రెస్పాన్స్ రాలేదు. పైగా.. రాజకీయ జోక్యం పెరిగిందన్న టాక్ కూడా వినిపిస్తోంది. దీంతో భూసేకరణ వ్యవహారం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఇక, బుల్లెట్ ట్రైన్‌కు ఆదిలోనే రెడ్ సిగ్నల్స్ పడుతున్నాయి. బహదూర్‌పురలో భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. పైగా ఈ భూముల్లోనే ఎక్కువగా పంటలు పండుతుండడంతో రైతులకు సెంటిమెంటుగా మారింది. దీంతో వారు సదరు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్ప టికే చేపట్టిన సర్వేలో 30 శాతం మంది తమ భూములు ఇవ్వబోమని చెబుతున్నారు. ఒకవేళ భూములు కావాలంటే బహిరంగ ధరలకు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఇది సర్కారుకు మరింత భారంగా మారనుంది. మెట్రో పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంది. ఒకవైపు భూముల సమస్యలతో పాటు.. మెట్రో అలైన్‌మెంటు
విషయంలో చోటు చేసుకున్న విమర్శలు రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నాయి. మరోవైపు కేంద్రం నుంచి ఆశించిన మేరకు
సహకారం లేదని సీఎం రేవంత్ స్వయంగా చెబుతున్నారు. రుణం విషయంలోనూ
సర్కారు స్పందించడం లేదని అంటున్నారు. ఈ పరిణామాలతో ఈ మూడు ప్రాజెక్టులు కూడా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా మారడం గమనార్హం. కానీ, మరో రెండు సంవత్సరాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో వీటిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం.. విద్యార్థిని దుర్మరణం

**హైదరాబాద్ పెన్ పవర్:** పేరేచర్ల - కొండమోడు రహదారి విస్తరణ పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పరిధిలోని నలంద కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ విద్యార్థినిని.. గత రాత్రి రోడ్డు పనుల నిమిత్తం వచ్చిన క్రేన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.అప్పటికే ఆమె పరిస్థితి విషమించి కన్నుమూసింది. రహదారి పనులు జరుగుతున్న సమయంలో క్రేన్ డ్రైవర్ కనీస జాగ్రత్తలు తీసుకోలేదని, పక్కనే వెళ్తున్న బాలికను గమనించకుండా అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.
ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రహదారి పనుల వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# రేవంత్ ఐదున్నర ఏళ్ల సీఎం..



**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో చూడని ముచ్చట రానున్న కాలంలో చూడబోతున్నామా అంటే జవాబు అవును అనే వస్తోంది. ఉమ్మడి ఏపీ కానీ అంతకు ముందు ఆ తరువాత విభజన ఏపీలో తెలంగాణాలో కానీ అయిదేళ్ళ సీఎంలను ఇంకా చెప్పాలంటే అంతకు తక్కువ పదవీ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులనే అంతా చూశారు. అతి తక్కువ కాలం పనిచేసిన నెల రోజుల సీఎం గా నాదెండ్ల భాస్కరరావు ఒక రికార్డు క్రియేట్ చేశారు. ఇపుడు అయిదున్నరేళ్ళకు పైగా సీఎం గా పనిచేసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త రికార్డు క్రియేట్ చేయబోతున్నారా అంటే రేవంత్ రెడ్డి మాటలను బట్టి చూస్తే జరగబోయేది అదే అని అర్థం అవుతోంది ఆరు నెలలు ముందుకు : రేవంత్ రెడ్డి తాజాగా ఖమ్మం జిల్లాలో జరిగిన సభలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఎన్నో ఆలోచనలు ప్రశ్నలు చర్చలకు తావిస్తున్నాయి. ఆయన ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాకు షెడ్యూల్ ప్రకారం 2028 డిసెంబర్ లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికలు 2029 మే లేదా జూన్ లో జరుగుతాయని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే మరో ఆరేడు నెలల పాటు తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని అర్థం అవుతోంది. అంతే రేవంత్ రెడ్డి ఏకంగా అయిదున్నర ఏళ్ళకు పైగా ముఖ్యమంత్రిగా ఉంటారని కూడా దీనిని బట్టి చెప్పుకోవాల్సి ఉంటుంది.అదే జరిగితే తెలంగాణాలో విపక్షాలకు అది భారీ షాక్ అని చెప్పాల్సి ఉంటుంది. విపక్షాలు అంటే బీజేపీ కాదు, బీఆర్ఎస్ అని కూడా ఇక్కడ భావించాలి. ఎందుకంటే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ తలచుకుంటేనే తెలంగాణాలో సార్వత్రిక ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడతాయి. దాంతో మరో రెండేళ్ళు ఆగండి మనదే ప్రభుత్వం అని తరచూ బీఆర్ఎస్ అగ్ర నేతలు జనాలకు పార్టీ జనాలకు చెబుతున్నారు. ఇపుడు వారే దిగాలు పడాల్సి ఉంటుంది. రాజకీయాల్లో ప్రతీ క్షణం విలువ అయినదే. అలాంటిది ఏకంగా ఆరేడు నెలలు కాంగ్రెస్ కి అదనంగా కలసి వస్తే కనుక కచ్చితంగా తెలంగాణా రాజకీయ సమీకరణలనే అది సమూలంగా మార్చేసే చాన్స్ ఉంటుంది. అలాంటపుడు మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశమూ ఉండొచ్చు. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి చెప్పిన ఈ మాటలు అయితే ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో బిగ్ డిబేట్ గా మారబోతున్నాయని చెప్పక తప్పదు. దేశంలో ఇందిరమ్మ తరువాత : ఇక రేవంత్ రెడ్డి అన్న మాట ప్రకారమే తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడితే మాత్రం కచ్చితంగా రేవంత్ రెడ్డి రికార్డు క్రియేట్ చేసినట్లే. దేశంలో ఆరేళ్ళ పాటు ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ టైం లో పనిచేశారు. ఆ విధంగా రేవంత్ రెడ్డి కూడా అయిదేళ్ళకు మించి అయిదున్నరేళ్ళ పాటు సీఎం గా పనిచేస్తే అది ఎప్పటికీ బ్రేక్ చేయలేని రికార్డుగా ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి తాజా సభలో చేసిన సంచలన కామెంట్స్ బిగ్ డిబేట్ కి దారి తీస్తున్నాయి. మరి దీని మీద బీఆర్ఎస్ నేతలు ఎలా రియాక్ట్ అవుతారో చూడాల్సిందే.

**కేరాఫ్ ఎంహెచ్ ఆర్డీ భవన్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ చతురతను మరోసారి చాటుకున్నారు. ఎంసీహెచ్ఆర్డీలో నిర్మించిన తన క్యాంపు ఆఫీసును మీడియా అందరికీ చూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న అల్ట్రా లగ్జరీ..వందలకోట్ల బడ్జెట్ వంటి ఆరోపణలకు లైవ్ స్పందన ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో పాటు తాను కూడా స్వయంగా వారితో పాటు తిరిగారుఈ వ్యతిరేక ప్రచారాలకు చెక్ పెట్టాలని భావించిన సీఎం రేవంత్ రెడ్డిఅత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఎలాంటి దాపరికం లేదనే సంకేతాన్ని ఇస్తూ.. ఏకంగా మీడియా ప్రతినిధులందరినీ స్వయంగా నూతన క్యాంపు ఆఫీస్ ప్రాంగణంలోకి తీసుకెళ్లి ప్రతి విభాగాన్నిచూపించారు. భవనం లోపల ఉన్న ఇంటీరియర్ డిజైన్ల నుండి ప్రతీ చిన్న విషయాన్ని జర్నలిస్టులకు దగ్గరుండి వివరించారు. లగ్జరీ హంగులు, ఆర్భాటాలు లేకుండా ఒక సాదాసీదా మధ్యతరగతి ఇల్లు ఎలాఉంటుందో, ఈ ప్రభుత్వ భవనం కూడా అలాగే ఉందనే విషయాన్ని కళ్లారా చూసేలా మీడియాకు స్పష్టమైన విజువల్స్ అందించారు. ముఖ్యంగా నివాస నిబంధనల పరిధిలోనే, పరిపాలనకు అవసరమైనరీతిలో మాత్రమే నిర్మాణం జరిగిందని రుజువు చేశారు.జర్నలిస్టులను స్వయంగా రెస్ట్‌రూమ్ వరకు తీసుకెళ్లిన ఆయన.. గత కేసీఆర్ పాలనలో కట్టిన ప్రగతి భవన్ లాగా నా ఆఫీసులో ఎలాంటి బుల్లెట్‌ప్రూఫ్‌బాత్‌రూమ్స్ లేవు అంటూ సెటైర్లు వేశారు. గతంలో ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలు, బుల్లెట్‌ప్రూఫ్ కిటికీలు, బాత్‌రూమ్‌ల గురించిన తీవ్రమైన వివాదాలను గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో అలాంటి రహస్యాలు, విలాసాలు ఏవీ లేవని మీడియా సాక్షిగా నిరూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న విలాసవంతమైన భవనమనే ఆరోపణల్లో ఎలాంటి సత్యం లేదని తేల్చిచెప్పారు.వ్యూహాత్మకంగాసాగిన ఈ మీడియా టూర్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టినట్లయింది. ఒకవైపు ప్రతిపక్షం లేవనెత్తిన భవన వ్యయం, విలాసాల గాసిప్స్‌కు క్షేత్రస్థాయి ఆధారాలతో అడ్డుకట్టవేయగా.. మరోవైపు ఈ ఆఫీసు వల్ల చుట్టుపక్కల ఉండే సామాన్య ప్రజలకు, రాకపోకలు సాగించే వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవనే క్లారిటీని ఇచ్చారు. పారదర్శకతకు పెద్దపీటవేస్తున్నామని చాటిచెబుతూ, గత పాలకుల రహస్య వైభవానికి.. ఇప్పటి ప్రజా ప్రతినిధుల సరళత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజల ముందుంచడంలో రేవంత్ రెడ్డి మార్క్ పొలిటికల్ స్ట్రాటజీ పూర్తిగా సక్సెస్ అయిందని అనుకోవచ్చు.

## 200 కిలోల గంజాయి రవాణా కేసు..

## సత్తెనపల్లికి చెందిన ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన గంజాయి అక్రమ రవాణా కేసులో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. తనిఖీలు నిర్వహించిన పోలీసులు కారులో సుమారు 200 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో ఈ అక్రమ రవాణాలో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి మరికొంత మంది పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరచాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ వినాయకనగర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంకా అలా, డిఎంహెచ్ వో శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ డా,, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి బస్తీ దవాఖాన పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.
బస్తీ దవాఖాన లో ప్రతి రోజు 100-150 ఓపీ వస్తుందని మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు.. దవాఖాన లో ఓపీ సంఖ్య పెంచాలని రోగుల పట్ల దయనీయంగా వ్యవహరించాలని సూచించారు. స్వయంగా షుగర్ టెస్ట్ , బ్లడ్ టెస్ట్ ,బీపీ టెస్ట్ చేసుకున్నారు. .బస్తీ దవాఖాన లో రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు లేదు అనకుండా చేయాలని అధికారులను ఆదేశించారు.
బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరిచి ప్రజల్లో నమ్మకం కలిగించే హైదరాబాద్ లో ఉన్న 169 బస్తీ దవాఖాన లకు ప్రత్యేక అధికారులను నియమించామని వారు బస్తీ దవాఖాన లో విజిట్ చేసి రోగుల కు అందుతున్న చికిత్స ,హాస్పిటల్ మౌలిక సదుపాయాలు, ఓపీ సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక అందించాలని ఆదేశించారు. హైదరాబాద్ బస్తీ దవాఖాన లు రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండేలా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం చేపట్టారు.

# శంషాబాద్ కు మరో గుర్తింపు



**హైదరాబాద్, జూలై 14, పెన్ పవర్:**
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (శంషాబాద్ విమానాశ్రయం) మరో అంతర్జాతీయ గుర్తింపును సొంతం చేసుకుంది. ఫ్యామిలీలతో ప్రయాణించే వారికి అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ సంస్థ ‘హాలిడేఎక్స్‌ట్రాస్.కామ్’ నిర్వహించిన ‘హ్యాపియెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ర్యాంకింగ్స్’లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఈ ఘనతను సాధించింది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారతదేశంలోని 2 విమానాశ్రయాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఒకటిగా నిలవడం విశేషం. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన సర్వేలో ప్రపంచవ్యాప్తంగా 140కుపైగా విమానాశ్రయాలను ట్రావెల్ సంస్థ పరిశీలించింది. ప్రధానంగా కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించారు. పిల్లల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, బేబీ చేంజింగ్ సదుపాయాలు, ఫ్యామిలీ సెక్యూరిటీ లేన్లు, స్ట్రోలర్ సేవలు, విశ్రాంతి ప్రాంతాలు, ఉచిత వై ఫై, ప్రయాణికుల భద్రత, విమానాశ్రయ విస్తీర్ణం, గూగుల్ సమీక్షలు, ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికులకు అందిస్తున్న సేవలు వంటి మొత్తం 9 ప్రమాణాల ఆధారంగా ప్రతీ ఎయిర్‌పోర్టును అంచనా వేశారు. ఈ పరిశీలనలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 20 పాయింట్లకు గాను 18.5 పాయింట్లు సాధించి ప్రపంచంలోనే నాలుగో అత్యుత్తమ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్ట్‌గా గుర్తింపు పొందింది. ప్రయాణికుల సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు, అందరికీ అందుబాటులో ఉండే సేవలు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు సాధించిన ఘనతపై జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో కదీర్ కదిరవన్ స్పందించారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సమగ్ర సేవలు అందించాలనే తమ లక్ష్యానికి ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రయాణ అనుభవాన్ని నిత్యం మెరుగుపరుస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు.

# పసిమొగ్గపై లైంగిక దాడి

**బెంగాల్, జూలై 14, పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆరేళ్ల చిన్నారి ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళింది. స్కూల్ ముగిసిన తర్వాత తల్లి ఆమెను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, ఆ చిన్నారి తీవ్ర భయాందోళనలతో కలత చెంది కనిపించింది. ఇంటికి వచ్చిన తర్వాత భయపడుతూనే పాఠశాలలో జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తాను టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ తలుపు లోపల గడియ పెట్టి, బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. ఆ సమయంలో నిందితుడి స్నేహితుడు వచ్చి బయటి నుండి తలుపు తట్టడంతో నిందితుడు చిన్నారిని వదిలేశాడు. లేకపోతే ఊపిరాడక స్పృహ కోల్పోయే స్థితికి ఆ చిన్నారి చేరుకుండేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దారుణంపై చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రిన్సిపాల్.. నిందితుడిని సమర్థించే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాఠశాల పరువు పోతుందని బెదిరిస్తూ, వారిని కూడా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్లక్ష్యపూరిత చర్యపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. స్కూల్ ఎదుట ఆందోళన తీవ్రం కావడంతో చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పాపియా సుల్తానా స్పందిస్తూ.. బాధితురాలి వయసు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరిన్ని వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని, తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, నిందితుడిని కాపాడటానికి ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని, బాధితులను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తోటి ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది..

# రోడ్డు ప్రమాదంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

**మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనంకర్నూలు**



**పెన్ పవర్:** జాతీయ రహదారి 44 పై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... 2వ బెటాలియన్ ఏపీఎస్పీకి చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి (43) ఈరోజు తెల్లవారుజామున సుమారు 5:20 గంటల ప్రాంతంలో బెటాలియన్ గేటు వద్ద తన స్కూటీని పార్క్ చేశారు. అనంతరం ఆయన జాతీయ రహదారి 44 పై మార్నింగ్ వాక్ (నడక) కోసం బయలుదేరారు. ఆయన బళ్ళారి చౌరస్తా సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే సమయంలో వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు వరప్రసాద్ రెడ్డి రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు కింద పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడు చిన్నరెడ్డి కుమారుడిగా పోలీసులు గుర్తించారు.

సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు:
ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లను సేకరిస్తున్నారు.

# ఘనంగా మల్లు రవి జన్మదిన వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పుట్టిన రోజు వేడుకలు జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 ఎంపీ ఎమ్మెల్యే కాలనీ లోని ఆయన నివాసం వద్ద మంగళవారం ఘనంగా జరిగాయి. మాజీ టిటిడి బోర్డు సభ్యుడు ఎస్బి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పుట్టినరోజు వేడుకల్లో ఎంపీ మల్లురవి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నగరం తో పాటు, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్ ప్రాంతాల నుంచి కార్యకర్తలు నేతలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి విచ్చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగం గొప్పతనాన్ని చెప్పే పుస్తకాలను

పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ టిపిసిసి అధ్యక్షుడు సంజు ముదిరాజ్, బాలరాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, మసూద్ హుస్సేన్, తేజ, కొండల్, రవీందర్ రెడ్డి, ప్రేమ్, అజహర్, ఖాజా, రాములు తదితరులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఓవైసీని భయపెడుతున్న స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్

హైదరాబాద్, జూలై 14 **పెన్ పవర్:**
మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన, దశాబ్దాలుగా పాతబస్తీని తమ రాజకీయ సామ్రాజ్యంగా ఏలుతున్న మజ్లిస్ పార్టీకి, ముఖ్యంగా ఓవైసీ కుటుంబానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షేత్రస్థాయిలో నకిలీ ఓట్లు, అక్రమ ఓట్ల వ్యవహారం ఈ ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి రాబోతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జోరందుకుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి పాతబస్తీ నియోజకవర్గాల్లో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45శాతం నుండి 50శాతం లోపే ఉండటానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలేనని ఈ నిరంతర తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో బూత్ లెవెల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓట్లు నమోదు చేసేవారు. దీనివల్ల ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా జాబితాలో అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కఠినమైన ‘స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్’లో అధికారులు పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ వంటి పక్కా లీగల్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పాతబస్తీలో తరతరాలుగా నివసిస్తున్న మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, సరైన పత్రాలు లేని పాత ఇళ్లలోనో ఉంటుండటంతో ఈ పత్రాలు చూపించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి పాతబస్తీలో భారీ సంఖ్యలో బోగస్, బల్క్ ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ సంక్షోభం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదయ్యే లాయల్ ఓట్ బ్యాంక్, బల్క్ ఓటింగ్ ఆధారంగానే అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తూ వస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రక్షాళన వల్ల లక్షలాది ఓట్లు తొలగిపోతే, ఎంఐఎం సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఛిన్నాభిన్నమవుతుంది. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఓటర్ల జాబితాలో నకిలీలు ఏరివేస్తే, ఓవైసీ కుటుంబానికి పాతబస్తీపై ఉన్న తిరుగులేని రాజకీయ పట్టు సడలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. తమ రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ని ఉపయోగించి, కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జారీ చేస్తున్నట్లుగా, ఇక్కడి ఓటర్లకు కూడా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఓవైసీ డిమాండ్ చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి ఈ శాశ్వత నివాస ధృవీకరణ డిమాండ్‌పై అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం కావడంతో, ఎంఐఎం అడిగినట్లు హడావుడిగా శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఏదేమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఓవైసీ మార్క్ ఏకపక్షాధిపత్యానికి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

# కాళేశ్వరం పై బీజేపీ కిం కర్తవ్యం...

**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ఒకవైపు కేంద్రంలోని తమ ప్రభుత్వ పరిధిలోని సంస్థ ఇచ్చిన నివేదికకు భిన్నంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడుతుండడం, మరోవైపు దీనిని అధికార కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుని విమర్శలు గుప్పించడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయం వేడెక్కింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి పరిశీలనలు జరిపింది. ప్రస్తుతానికి మేడిగడ్డ వద్ద నీటిని నిలపవద్దని, అలా చేస్తే బ్యారేజీ నిర్మాణానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టమైన సిఫారసు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ సంస్థ పనిచేస్తోంది. అయితే, విచిత్రంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఇందుకు భిన్నమైన డిమాండ్లను తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగంగానే స్పందిస్తూ.. కాళేశ్వరంలో నీటిని నింపి, ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సైతం కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. కేంద్ర సంస్థ చెప్పినదానికి భిన్నంగా, రాష్ట్ర బీజేపీ నేతలు నీటిని నింపాలని కోరడం వెనుక ఉన్న వ్యూహం ఏంటో అర్థం కాక ఆ పార్టీ శ్రేణులే గందరగోళానికి గురవుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతల విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతే దీటుగా స్పందిస్తోంది. తాము సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్డీఎస్ఏ సిఫారసులనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఒకవేళ ఎన్డీఎస్ఏ నివేదికను కాదని నీటిని నిలిపితే, భవిష్యత్తులో బ్యారేజీకి ఏమైనా నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని



కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కేంద్ర సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లేనిపోని సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం వివరిస్తోంది. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ గందరగోళాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా వాడుకుంటోంది. బీఆర్ఎస్ చెప్పినట్లే బీజేపీ నేతలు ఆడుతున్నారంటూ కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, వైఫల్యాలపై బీఆర్ఎస్ తీరును గతంలో తప్పుబట్టిన బీజేపీ, ఇప్పుడు అదే బీఆర్ఎస్ లైన్‌ను ఎందుకు అందుకుందని ప్రశ్నిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే ఈటల రాజేందర్ నడుచుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత అవగాహన కుదిరిందనే అనుమానాలకు ఈ వైఖరే నిదర్శనమని కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని గతంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే క్రమంలో, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు కేంద్ర సంస్థ నీళ్లు నిలపొద్దంటుంటే, మరోవైపు రాష్ట్ర నేతలు నీళ్లు నింపాలనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో సరైన సమన్వయం, స్పష్టత కొరవడిందని స్వయంగా బీజేపీలోని కొందరు ముఖ్య నేతలే అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ ఎంత ఆలస్యమైతే అంత రాజకీయ ప్రయోజనం పొందాలని ఒకరు, కేంద్ర నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను కట్టడి చేయాలని మరొకరు చూస్తున్నారు. ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ తీసుకుంటున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు ఆ పార్టీకే తిప్పలు తెచ్చిపెట్టేలా కనిపిస్తున్నాయి.

# కేటీఆర్ పాదయాత్ర పోస్ట్ పోన్..?

**హైదరాబాద్, జూలై 14 పెన్ పవర్:**
తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ ఏడాది నుంచే ఆ పాదయాత్ర ప్రారంభం కావాల్సి ఉంది. దీనిపై కేటీఆర్ .. పార్టీలోనూ.. తన కుటుంబంలోనూ చర్చించినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. రాజకీయంగా పాదయాత్ర ఏమేరకు తమకు దోహదపడుతుందన్న విషయంపైనా ఆయన ఆరా తీశారు. అధికారంలోకి వచ్చేందుకు ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది కూడా తెలుసుకున్నారు. పాదయాత్ర చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు చేరువ కావడం ఒక భాగమైతే.. మరోవైపు పార్టీని డెవలప్ చేసుకోవడం మరో లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రకు కేటీఆర్ తొలిసారి ప్రాధాన్యం ఇస్తున్నారన్న చర్చ కూడా ఉంది. మరోవైపు కేసీఆర్ సైతం బస్సు యాత్ర చేస్తారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. దీనిని కేటీఆర్ కూడా ఔననే చెప్పారు. సో.. అటు కేటీఆర్, ఇటు కేసీఆర్ ఏకకాలంలో ప్రజలను కలుసుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చి.. తద్వారా మరోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేయడం ఖాయమన్న బీఆర్ఎస్ వర్గాల మాట. అయితే... ఇప్పుడు రెండు యాత్రలు కూడా వాయిదా పడ్డాయని తెలుస్తోంది. ఈ ఏడాదే పాదయాత్ర ప్రారంభిస్తానని కేటీఆర్ చెప్పినప్పటికీ.. ప్రజల్లో ఆమేరకు అవసరమైన రాజకీయ పరిస్థితి కనిపించడం లేదని దీంతో ఇప్పుడు పాదయాత్ర చేసినా విఫల ప్రయత్నమే అవుతుందన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజల్లో ఎక్కడా మోహం మొత్తలేదు. పైగా.. ప్రభుత్వ వాదన విషయంలో ప్రజలు అర్థం చేసుకుంటున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. దీంతో ఇప్పటికిప్పుడు సర్కారుపై వ్యతిరేకత లేదన్నది సుస్పష్టమవుతోంది. సహజంగా ఇలాంటి పాదయాత్రలు.. ప్రజల్లో సదరు ప్రభుత్వాలపై వ్యతిరేకత ప్రారంభమైనప్పుడు చేపడితే ఫలితం ఆశించినట్టుగా ఉంటుంది. కానీ, ఇప్పుడు తెలంగాణలో కేటీఆర్ ఆశించినట్టుగా వ్యతిరేకత కనిపించడం లేదు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి విషయంలో మరింత సానుకూలంగానే వ్యవహరిస్తున్నారన్న పేరు వినిపిస్తుండడంతో తన పాదయాత్ర సహా కేసీఆర్ బస్సు యాత్రలనువచ్చే ఏడాదికి పోస్టు పోన్ చేసుకున్నారని తెలుస్తోంది. అయితే.. దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

# టీడీపీలో భారీ మార్పులు




**విజయవాడ, జూలై 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి పరిపాలనలో దూసుకుపోతున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అంతర్గత బలోపేతంపై అత్యంత కీలకమైన వ్యూహాత్మక కసరత్తును ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు ఒక భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా చాలా మంది సీనియర్లను, యాక్టివ్‌గా లేని నాయకులను పక్కన పెట్టేసి, కొత్త ముఖాలకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేయాలని టీడీపీ అధిష్టానం డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీకి సొంత ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు లేదా ఇన్‌ఛార్జ్‌లు సరిగ్గా పని చేయని చోట్ల గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. కేవలం పేరుకే ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటూ, క్యాడర్‌ను పట్టించుకోని వారిని మార్చేయాలని చంద్రబాబు గట్టిగా ఉన్నారట. అక్కడ సమర్థులైన, ప్రజల్లో నిరంతరం ఉండే కొత్త నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన సీఎం చంద్రబాబుఇక ఈ సమీక్షల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైనా టీడీపీ అంతర్గతంగా సమీక్షలు నిర్వహిస్తోంది. కూటమి ధర్మం ప్రకారం ఆయా స్థానాలు మిత్రపక్షాలకే ఉన్నప్పటికీ, అక్కడ టీడీపీ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం, క్యాడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యవసరం అని భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాల స్థానాల్లో కూడా టీడీపీ బలాన్ని తగ్గకుండా చూసుకునేందుకు అంతర్గత సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న ఆ 11 నియోజకవర్గాలపై టీడీపీ టాప్ ప్రయారిటీ పెట్టింది. ఆ 11 స్థానాల్లో వైసీపీని పూర్తిగా ఖాళీ చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. అక్కడ పార్టీ ఎందుకు ఓడిపోయింది? ఎక్కడ లోపాలు జరిగాయి? అనే విషయాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బేరీజు వేస్తున్నారు. ఒకవేళ వారి వల్ల పార్టీ పుంజుకునే అవకాశం లేదని తేలితే, క్షణం కూడా ఆలోచించకుండా వారిని పక్కన పెట్టి.. ఆర్థికంగా, అంగబలం పరంగా, ప్రజల్లో క్రేజ్ ఉన్న సరికొత్త సమర్థ నాయకులను రంగంలోకి దించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈసారి సమీక్షల్లో కేవలం "పనితీరు" మాత్రమే ఏకైక ప్రామాణికం అని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎంతటి సీనియర్ నాయకుడైనా, గతంలో ఎంత పెద్ద పదవి అనుభవించినా సరే.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేకపోతే, సమన్వయ కమిటీలు సరిగ్గా నడపకపోతే వారిని తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పాత తరం నేతలను పక్కన పెట్టేసి, కొత్త వారికి, యువతకు ఛాన్స్ ఇవ్వాలనే గట్టి ఆలోచనలో అధిష్టానం ఉంది.

# రావణ్ విషయంలో నేతల యూ టర్న్

**విజయవాడ, జూలై 14 పెన్ పవర్:** ఏపీలో ఆసక్తి రేకెత్తించిన జోసెఫ్ రావణ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారంపై కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. జనసేన అదినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అసభ్య పదజాలాన్ని ప్రయోగించిన కేసులో అరెస్టు అయిన రావణ్ కు న్యాయ సహాయం చేసిన ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్... తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ప్రశ్న రావణ్ తో తనకు అంతగా సంబంధాలేమీ లేవని చెప్పిన శ్రావణ్... రావణ్ కు అతడి కుటుంబం నుంచి కూడా పెద్దగా మద్దతు లేదని సంచలన వ్యాఖ్య చేశారు. రావణ్ వ్యవహారంలో విపక్ష వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని కూడా శ్రావణ్ ఆరోపించారు. ప్రశ్న రావణ్ తో తనకు పెద్దగా స్నేహమే లేదని శ్రావణ్ తెలిపారు. ఆకివీడు వ్యవహారంలోనే తనకు రావణ్ తో పరిచయం అయ్యిందని, ఆ తర్వాత తన ఇంటర్వ్యూ కోసం రావణ్ తనను సంప్రదించారని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే తాను రావణ్ తో ఫోన్ లో మాట్లాడానని ఆయన తెలిపారు. అంతకుమించి రావణ్ తో తనకు ప్రత్యక్ష సంబంధాలేమీ లేవని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక ఓ బాధ్యత కలిగిన సామాజిక వేత్తగా, న్యాయవాదిగా మాత్రమే తాను రావణ్ కేసులను వాదించానని, అంతకుమించి రావణ్ తో తనకు మైత్రి లేదని ఆయన తేల్చేశారు. ఇక రావణ్ ఓ రేంజిలో ఎలివేట్ కావడానికి దారి తీసిన ఏలూరు బహిరంగ సభలో అంతా తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని శ్రావణ్ పేర్కొన్నారు. ఆ సభలో వేదిక మీదకు వచ్చేవారిలో రావణ్ పేరే లేదని ఆయన అన్నారు. ఆహ్వానితుల జాబితాలో పేరు లేకున్నా.. సభ నిర్వాహకుడిగా ఉన్న తన అనుమతి లేకుండానే రావణ్ వేదిక మీదకు వచ్చారని, అంతేకాకుండా తనకంటే ముందుగానే తన అనుమతి లేకుండా రావణ్ మైకందుకుని మరీ ప్రసంగించారని ఆయన ఆరోపించారు. అయితే వేదిపై శ్రవణ్ అన్న రమ్మంటేనే వచ్చానని రావణ్ మాట్లాడడం గమనార్హం. రావణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన తేల్చేశారు. తాను నిర్వహించిన సభలో తన అనుమతి లేకుండా మాట్లాడిన రావణ్ అరెస్టు అయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలు చూస్తుంటే జడ శ్రవణ్ ఈ కేసు నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రావణ్ కు వైసీపీ మద్దతు పలుకుతున్న వైనంపైనా శ్రావణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదికార కూటమికి చెందిన కీలక నేతలపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్న ప్రతి ఒక్కరికి వైసీపీ నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అందులో భాగంగానే రావణ్ కు వైసీపీ నుంచి మద్దతు లభించిందని ఆయన అన్నారు. అయితే రావణ్ హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిన తర్వాత వైసీపీ అతడి నుంచి దూరం జరగాలని భావించిందని, అయితే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తనకు మాత్రం వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లేదని ఆయన అన్నారు. ఎంగిలి మెతుకులనూ విదల్చని మాదిరిగా వ్యవహరిస్తున్న వైసీపీ నుంచి తనకు ఎలాంటి సాయం అవసరం లేదని కూడా ఆయన ఘాటు వ్యాఖ్య చేశారు. ఇక రావణ్ వ్యవహారంలో పరిమితికి మించి స్పందిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యవహారంపైనా శ్రావణ్ స్పందించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ ల మధ్య చాలా కాలం నుంచే పరిచయం ఉన్నట్టుందని ఆయన వ్యాఖ్యానించారు. రావణ్ గురించి మాట్లాడేందుకే ప్రకాశ్ రాజ్ తనకు పలుమార్లు కాల్ చేశారని ఆయన చెప్పారు. ఇక రావణ్ కు అతడి కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని చెప్పారు. రావణ్ కు న్యాయ సహకారంతో పాటుగా ఇతరత్రా సాయాన్ని కూడా తానే చేస్తున్నానని తెలిపారు. రావణ్ కు అన్నీ తానై సాయం చేస్తుంటే... అతడి బృందంలోని గమన అనే యువతి వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తీరుపై శ్రావణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

దారిలోకి వచ్చిన ఏబీవీ

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలో కూటమి ప్రభుత్వానికి సూచనలు చేసిన సందర్భాల్లోనూ ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా ఉపా చట్టం (యూఏపీఏ) వినియోగంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన ఏబీవీ, ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదికను పంచుకోవడంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ఆ వేదికపై అంబటి రాంబాబు ఏమి మాట్లాడారో తాను వినలేదని, ఆయన పక్కన కూర్చున్నాననే కారణంతో సభ మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని చెప్పారు. "మీ అందరితో హీరో అనిపించుకోవడం కోసం నేను సంస్కారం వదిలేయాలా? మీరు నా గురించి పొరబడ్డారు. నేనలాంటి వాడిని కాదు" అంటూ ఏబీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరించాలనుకుంటుందా? అని ప్రశ్నించారు. ఇంతకుముందు అమరావతి భూసేకరణ అంశంపైనా ఏబీవీ స్పందించారు. రెండో విడతలో వేలాది ఎకరాల భూమిని సేకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం కష్టమవుతుందని హెచ్చరించారు. అలాగే అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు. అలాగే జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశాన్ని కూడా తేలికగా తీసుకోవద్దని సూచించారు. యూట్యూబ్ వ్యాఖ్యలపై ఉపా చట్టాన్ని ప్రయోగించే విషయంలో రాజద్రోహం కేసు అవసరం లేదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో కూటమి కార్యకర్తల నుంచి విమర్శలు రావడంతో, తాను చేస్తున్న వ్యాఖ్యలను సద్విమర్శలుగా స్వీకరించాలని ఏబీవీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వరుస పోస్టులు చేస్తూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.

# వ్యూహం మార్చుకుంటున్న వైసీపీ?
# ఐ ప్యాక్ స్థానంలో కపిల్ సాహు

**విజయవాడ, జూలై 14 పెన్ పవర్:**

2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ–ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహాకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ–ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్–ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..

**కర్నులు, జూలై 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది. అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

## మాజీ మంత్రి ఓటు గల్లంతు

**గుంటూరు, జూలై 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఓటును పునరుద్ధరించాలని కోరారు. డాక్టర్ శనక్కాయల అరుణకుమారి 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రెండో మంత్రివర్గంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది. ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియకు జూలై 14 చివరి గడువుగా నిర్ణయించారు. మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యం. చివరి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు సవరణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ప్రజలు హెల్ప్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో మాజీ మంత్రి ఓటు గల్లంతు కావడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## మార్చిలోనే పోలవరం ప్రారంభం

**ఏలూరు, జూలై 14 పెన్ పవర్:** పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014–19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాపర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

## జనసేన విస్తరణకు పక్కా ప్లాన్
## బూత్ కమిటీలతో రెడీ అవుతున్న కేడర్

**కాకినాడ, జూలై 14 పెన్ పవర్:** జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు. ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్ల పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారుఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# చదువుల ఒత్తిడి కాదు.. ఆలోచించే వ్యవస్థ కావాలి!



మన విద్యావ్యవస్థలో ఈరోజుల్లో మార్కుల వేట, ర్యాంకుల గోల ఎక్కువైపోయింది. సినిమాల్లో బట్టీపట్టి రాసే 'చతుర్' లాంటి వాళ్లను మనం హీరోలుగా చూస్తున్నామే తప్ప, సరికొత్తగా ఆలోచించే 'పున్‌సుక్ వాంగ్డూ' లాంటి మేధావులను గుర్తించలేకపోతున్నాం. పుస్తకాల్లో ఉన్న దాన్ని ఉన్నట్టుగా అప్పజెప్పే ఒత్తిడి కంటే, ఒక విద్యార్థిలో స్వతంత్రంగా ఆలోచించే తత్వాన్ని పెంచడమే అసలైన విద్య. ఆ మార్పు రానంతవరకు, మనం కేవలం డిగ్రీలు ఉన్న రోబోలను మాత్రమే తయారు చేయగలం కానీ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కర్తలను కాదు.

**బట్టీల బడి.. ఆలోచనల సమాధి:**
ఈ రోజుల్లో బడులు ఎలా తయారయ్యాయంటే.. పుస్తకంలో ఏముందో దాన్ని అలాగే తలకెక్కించుకోవాలి, పరీక్షల్లో అక్షరం పొల్లుపోకుండా దింపేయాలి. సరిగ్గా '3 ఇడియట్స్' సినిమాలో చతుర్ చేసినట్టు అన్నమాట.. కానీ ఈ పద్ధతి వల్ల పిల్లల్లో స్వంతంగా ఆలోచించే శక్తి చచ్చిపోతోంది. సైన్స్ అంటే కేవలం పరీక్షల కోసం చదవడం కాదు, సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం వెతకడం అనే విషయాన్ని మన విద్యావ్యవస్థ మర్చిపోతోంది.

**ర్యాంకుల ఒత్తిడితో ఊపిరాడని బాల్యం:**
క్లాసులో ఫస్ట్ ర్యాంకు రావాలనే పట్టుదల, పక్కింటి అబ్బాయితో పోలికలు పిల్లల మనసులపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. 99 శాతం మార్కులు వస్తేనే ప్రయోజకుడు అంటారనే భయం పిల్లలను నిరంతరం వెంటాడుతోంది. ఫలితంగా వాళ్లు సబ్జెక్టును ప్రేమించి చదవడం లేదు, కేవలం భయంతో చదువుతున్నారు. ఈ ఒత్తిడి వల్లే ఎంతోమంది క్రియేటివ్ పిల్లలు తమ సహజ సిద్ధమైన టాలెంట్‌ను బయటపెట్టలేకపోతున్నారు.

**సమాజానికి కావాల్సింది ఆవిష్కర్తలు.. యంత్రాలు కాదు:**
మన దేశంలో ఇంజనీరింగ్, మెడిసిన్ డిగ్రీలు పూర్తి చేసిన లక్షలాది మంది యువత బయటకు వస్తున్నారు. కానీ అందులో ఎంతమంది కొత్త ఆలోచనలతో స్టార్టప్స్ పెడుతున్నారు? ఎంతమంది మన సమస్యలకు కొత్త పరిష్కారాలు కనిపెడుతున్నారు? చాలా తక్కువ. కారణం, మన చదువులు కేవలం ఉద్యోగం ఎలా చేయాలో నేర్పుతున్నాయే తప్ప, కొత్తగా ఎలా ఆలోచించాలో నేర్పడం లేదు. మనకు కావలసింది ఉద్యోగాలు చేసే రోబోలు కాదు, సరికొత్త దారులు వెతికే మేధావులు.

**ప్రశ్నించే తత్వమే అసలైన చదువు:**
ఒక క్లాసు రూమ్‌లో పిల్లవాడు టీచర్‌ను ఒక వింత ప్రశ్న అడిగితే వెంటనే చాలామంది నవ్వుతారు, లేదా టీచర్లు కోప్పడతారు. సరిగ్గా '35' సినిమాలో పిల్లడు కి జరిగినట్టు, కానీ అక్కడే అసలైన తప్పు జరుగుతోంది. ఇక ప్రశ్నించడం నుంచే కొత్త ఆలోచనలు పుడతాయి. సమాజంలో ప్రతిదానిని గమనించడం, "ఇది ఇలా ఎందుకు ఉంది? దీన్ని ఇంకా సులభంగా ఎలా చేయవచ్చు?" అని ఆలోచించే వాతావరణం మన స్కూళ్లలో పెరగాలి. పుస్తకాలను దాటి లోకాన్ని చూడగలిగినప్పుడే అసలైన విద్య అందుతుంది.

**విద్యావ్యవస్థలో రావాల్సిన మార్పు:**
కేవలం పరీక్షలు పాస్ అవ్వడం కోసం చదివే విధానానికి ఇకనైనా స్వస్తి పలకాలి. పిల్లలపై మార్కుల ఒత్తిడిని తగ్గించి, వారి క్రియేటివిటీకి రెక్కలు తొడగాలి. బట్టీపట్టే 'చతుర్'లను కాకుండా, వినూత్నంగా ఆలోచించి సమాజాన్ని మార్చే 'పున్‌సుక్ వాంగ్డూ' లాంటి మేధావులను ప్రోత్సహించే ఆలోచనా వ్యవస్థ మనకు కావాలి. అప్పుడే మన దేశంలో నిజమైన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి...

# డిటర్జెంట్‌తో 2.3 కోట్ల లీటర్ల కల్తీ పాలు.. మనుషులను బతకనివ్వరారా భూమ్మీద..

మనం రోజూ పొద్దున్నే లేవగానే తాగే పాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని డాక్టర్లు చెబుతుంటారు. కానీ ఆ పాలలో కాస్త డిటర్జెంట్ పౌడర్, చిటికెడు పామ్ ఆయిల్, మరికొన్ని నాసిరకం రసాయనాలు కలిపి ఇస్తే? వినడానికే ఒళ్ళు జలదరిస్తోంది కదూ! మహారాష్ట్రలోని ధారాశివ్ ఉస్మానాబాద్ జిల్లా భూమ్ తాలూకాలో ఇలాంటి ఒక అద్భుతమైన "సైంటిఫిక్ ప్రయోగం" గత ఆరు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా సాగిపోయింది. స్వచ్ఛమైన అమృతం లాంటి పాలలో డిటర్జెంట్ కలిపి, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడిన ఒక భారీ కల్తీ పాల కుంభకోణాన్ని పోలీసులు, ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఎట్టకేలకు బట్టబయలు చేశారు.పాలు తెల్లగా ఉండాలి.. పైన మీగడ కట్టాలి... ఇందుకోసం మన ఘనాపాటి కల్తీ బాబులు వాడిన ఫార్ములా చూస్తే షాక్ అవ్వాల్సిందే. బట్టలు ఉతికే డిటర్జెంట్ పౌడర్, పామ్ ఆయిల్, ఇంకా ఏవేవో పనికిరాని కెమికల్ పౌడర్లను కలిపి ల్యాబ్‌లో తయారు చేసినట్లు సింథటిక్ పాలను సృష్టించారు.

**లెక్కలు చూస్తే మైండ్ బ్లాకే**
అధికారులు స్వాధీనం చేసుకున్న విక్రయ రిజిస్టర్లను చూసి వారి బుర్రలు తిరిగాయి. గత ఆరు నెలల్లో వీరు చేసిన మాయాజాలం అంతా ఇంతా కాదు వాడిన నాసిరకం మిల్క్ పౌడర్ సుమారు 2,30,470 కిలోలు. తయారు చేసిన సింథటిక్ పాలు దాదాపు 23,04,070 లీటర్లు. మార్కెట్లో అమ్మిన కల్తీ పాలు 2.3 కోట్ల లీటర్లకు పైమాటే! ఈ మాయా బజార్ విలువ అక్షరాలా రూ.9.21 కోట్లు కావడం విస్తుగొలుపుతోంది. వీరి వ్యాపార సూత్రం చాలా సింపుల్... ప్రతి 100 లీటర్ల స్వచ్ఛమైన పాలలో 10 లీటర్ల ఈ కెమికల్ పాలను గుట్టుచప్పుడు కాకుండా కలిపేసేవారు. వినియోగదారుడికి రంగు మారుతుందన్న భయం లేదు, చిక్కదనం తగ్గుతుందన్న డౌట్ రాదు. ఎంతైనా 'కల్తీ' కళలో వీరు పిహెచ్‌డీ చేసినట్టున్నారు!

**పశువుల దాణా పేరుతో పాయజన్ బిజినెస్**
భూమ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీగణేష్ కనగుడే తెలిపిన వివరాల ప్రకారం ఈ రాకెట్‌ను పశువుల దాణా వ్యాపారం పేరుతో నడిపించారు. దాడుల్లో 61 సంచుల కల్తీ మిల్క్ పౌడర్ దొరికింది. బాలాసాహెబ్ గోడ్గే అనే మహాశయుడు ఈ కల్తీ పౌడర్‌ను స్థానిక డెయిరీలకు సప్లై చేసినట్లు తేలింది. భూమ్ తాలూకా నుండి ప్రతిరోజూ లక్షల లీటర్ల పాలు, 70 నుండి 80 టన్నుల ఖోవా ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతుంటుంది. అంటే ఈ పాటికే ఎంతమంది ఈ డిటర్జెంట్ పాలను రుచి చూశారో ఆ దేవుడికే తెలియాలి. ఈ రసాయనాల పాలు తాగితే కాలేయం, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ నాశనమవడం ఖాయం. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ఇది స్లో పాయిజన్ లాంటిది.

**నిందితులు ఎక్కడ? చట్టం ఏం చెబుతోంది?**
ఈ కేసులో ఏడుగురిపై ఫుడ్ సేఫ్టీ చట్టం కింద కేసులు పెట్టారు. కేసు నమోదై ఎనిమిది రోజులు గడిచినా నిందితులు మాత్రం దొరకకుండా 'స్వచ్ఛమైన' పాలలో నీళ్లలాగా మాయమైపోయారు. వారి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం గాలిస్తోంది. మన ఫుడ్ సేఫ్టీ చట్టం ప్రకారం ఇలా ప్రాణాలతో చెలగాటమాడితే రూ.10 లక్షల జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉందట. మరి ఈ కల్తీ కేటుగాళ్లకు ఆ శిక్ష పడుతుందో లేదో చూడాలి. అప్పటివరకు పాల ప్యాకెట్ కొనేటప్పుడు అది 'పాలేనా' లేక 'సర్ఫ్ ఎక్సెల్' మిశ్రమమా అని కాస్త చూసుకోవడం మన ఆరోగ్యానికి మంచిది!

**సీఐ, ఎస్ఐతోపాటు 25 మంది పోలీసులకు పనిష్మెంట్.. స్టేషన్ మొత్తం ఖాళీ..**

# నెల్లూరు ఎస్పీ సంచలన నిర్ణయం



ఏపీ పోలీసు చరిత్రలో ఒక పోలీసుస్టేషన్ సిబ్బంది అందరినీ ఒకేసారి బదిలీ చేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ఒక వ్యవసాయాధికారి అనుమానాస్పద మృతి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో సీఐ, ఎస్ఐతోపాటు మొత్తం 25 మంది పోలీసు సిబ్బంది బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన వ్యవసాయాధికారి (ఏవో) నడవాటి శ్రీహరి అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటనపై ఏవో సహచరులు, సహోద్యోగులు పోలీసులకు సమాచారం ఇచ్చినా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఉన్నతాధికారులు నిర్ధారించారు. దీంతో సీఐ, ఎస్ఐని వీఆర్ కు పంపగా, మిగిలిన సిబ్బంది అందరినీ జిల్లాలో వేర్వేరు పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు. ఒక పోలీసుస్టేషన్ కు చెందిన సిబ్బంది మొత్తాన్ని ఒకేసారి బదిలీ చేయడం ఇప్పటివరకు చోటుచేసుకోలేదని పోలీసు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. విధి నిర్వహణలో లోపాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం సహజమే అయినప్పటికీ ఇంతటి సీరియస్ యాక్షన్ తీసుకోవడమే సంచలనం రేపుతోంది. మృతుడి భార్య ఫిర్యాదుతో డీఎస్పీ దర్యాప్తు చేయగా, పోలీసుల నిర్లక్ష్యం బయటపడిందని చెబుతున్నారు. దీంతో విషయం ఎస్పీ అజిత వేజెండ్ల దృష్టికి వెళ్లగా, ఆమె తీవ్ర ఆగ్రహానికి గురై స్టేషన్ సిబ్బంది అందరిపై ఒకేసారి వేటు వేశారు.
ఈ ఘటన నెల్లూరు జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పోలీసువర్గాలలో సంచలన చర్చకు దారితీసింది. ఇటీవల కాలంలో పోలీసుల అనేక ఆరోపణలు వస్తుండగా, నెల్లూరు ఎస్పీ తీసుకున్న చర్యతో విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు అయిందని అంటున్నారు. కాగా, తీవ్ర చర్చనీయాంశం అయిన ఈ ఘటనలో ఏవో శ్రీహరి మరణంపై హత్య కేసు నమోదు చేయగా, నిందితులకు సహకరించారనే కారణంగా కొందరు పోలీసులను కూడా నిందితుల జాబితాలో చేర్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

**హత్య చేసి గుండెపోటు డ్రామా?**
కాగా, ఒక పోలీసుస్టేషన్ సిబ్బంది మొత్తంపై బదిలీ వేటు పడేలా చేసిన ఏవో శ్రీహరి మృతి కేసు విస్తృత చర్చనీయాంశం అవుతోంది. శ్రీహరిని సొంత బావమరిది హరికృష్ణ, మరికొందరి సాయంతో అంతమొందించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు చెబుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఏవో స్వగ్రామమైన కొత్తమినగల్లుకు శ్రీహరిని కారులో తీసుకువెళ్లిన హరికృష్ణ మార్గమధ్యలో కుక్కలకు ఇచ్చే మత్తుమందును బలవంతంగా ఇంజెక్షన్ రూపంలో శ్రీహరికి ఇచ్చి ఆ తర్వాత ఊపిరాడకుండా చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆర్థిక లావాదేవీల కారణంగా బావ శ్రీహరిని హత్య చేయాలని నిందితుడు కుట్ర పన్నగా, అతడికి మరో ఇద్దరు సహకరించినట్లు చెబుతున్నారు. అయితే శ్రీహరి గుండెపోటుతో మరణించారని తొలుత కుటుంబ సభ్యులను నిందితుడు నమ్మించడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదని అంటున్నారు. మరోవైపు మృతదేహం ఉన్నప్పుడే శరీరంపై గాయాలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినా, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్న కారణంగా పోలీసు అధికారులు పట్టించుకోలేదని చెబుతున్నారు. అయితే తొలుత భర్త గుండెపోటుతో మరణించారని భావించిన భార్య లావణ్య తర్వాత సోదరుడిపై అనుమానంతో పోలీసులను ఆశ్రయించగా, అసలు విషయం వెలుగుచూసిందని చెబుతున్నారు.

# ట్రంప్ 'కరెన్సీ' రాజకీయం: అమెరికా నోట్లపై సంతకం.. నాణెంపై బొమ్మ.. రేగుతున్న వివాదం




అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో అక్కడి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని సంచలన నిర్ణయాలు ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సాధారణంగా ఏ దేశంలోనైనా కరెన్సీ నోట్లు, నాణేలపై దేశ ప్రతిష్ఠను చాటే చిహ్నాలు, చారిత్రక పురుషుల చిత్రాలు ఉంటాయి. కానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పేరును, సంతకాన్ని, చివరికి తన ముఖచిత్రాన్ని కూడా దేశ కరెన్సీపై ముద్రించేందుకు సిద్ధమవ్వడం ఇప్పుడు రాజకీయంగా, సామాజికంగా పెద్ద దుమారమే రేపుతోంది. ఇది ట్రంప్ ఆత్మస్తుతికి, వ్యక్తిగత ప్రచార పతాకస్థాయికి నిదర్శనమంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

**తొలిసారిగా కరెన్సీపై దేశ అధ్యక్షుడి సంతకం**
అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటించిన వివరాల ప్రకారం.. తొలిదశలో భాగంగా ట్రంప్ సంతకంతో కూడిన కొత్త 100 డాలర్ల నోట్ల ముద్రణ ఇప్పటికే ప్రారంభమైంది. అమెరికా చరిత్రలోనే అధికారంలో ఉన్న ఒక అధ్యక్షుడి సంతకం కరెన్సీ నోటుపై కనిపించబోతుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సాధారణంగా ట్రెజరీ కార్యదర్శుల సంతకాలు మాత్రమే కరెన్సీపై ఉంటాయి, కానీ ట్రంప్ తన మార్క్ కోసం ఈ కొత్త సంప్రదాయానికి తెరలేపారు.
ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రంప్ సంతకంతో ఉన్న 100 డాలర్ల నోట్ నమూనా విపరీతంగా వైరల్‌గా మారింది. దీనిని ట్రంప్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో చర్చ మరింత ముదిరింది. కొందరు దీనిని అమెరికా చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా అభివర్ణిస్తుండగా మరికొందరు మాత్రం ప్రభుత్వ వ్యవస్థలను వ్యక్తిగత ప్రచార వేదికలుగా మార్చే ప్రయత్నమని విమర్శిస్తున్నారు. ట్రంప్ సంతకం శైలిపై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ.. "సంతకం ఎంత గజిబిజిగా ఉందో.. ఆయన పాలన కూడా అంతే గజిబిజిగా ఉంది" అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.

వ1 నాణెంపై ట్రంప్ ముఖచిత్రం.. చట్టపరమైన చిక్కులు
నోటుపై సంతకంతో ఆగకుండా ఏకంగా 1 డాలర్ నాణెం పై ట్రంప్ ముఖచిత్రాన్ని ముద్రించాలనే ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఇక్కడే ట్రంప్ ప్రభుత్వానికి ఒక పెద్ద చట్టపరమైన అడ్డంకి ఎదురైంది. ప్రస్తుత అమెరికా చట్టాల ప్రకారం.. జీవించి ఉన్న ఏ వ్యక్తి చిత్రాన్ని కూడా అధికారిక చలామణిలో ఉండే కరెన్సీ లేదా నాణేలపై ముద్రించడం నిషిద్ధం. అందువల్ల ట్రంప్ బొమ్మతో కూడిన కాయిన్ విడుదల కావాలంటే అమెరికన్ కాంగ్రెస్ ప్రత్యేకంగా చట్టాన్ని సవరించి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. న్యాయ నిపుణులు సైతం ఈ విషయాన్ని స్పష్టం చేయడంతో ఈ అంశంపై తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉంది.

**చారిత్రక నిర్ణయమా? వ్యక్తి ఆరాధనా?**
ఇప్పటికే విదేశాంగ విధానాలు, సుంకాల పెంపు, అంతర్జాతీయ యుద్ధాలపై తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ట్రంప్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో కరెన్సీపై తన ముద్ర వేయాలనే ప్రయత్నం మంటలకు మరింత నెయ్యి పోసినట్లయింది.
అధికార పక్షం వాదన.. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని దేశ చరిత్రలో నిలిచిపోయేలా తీసుకున్న చారిత్రక నిర్ణయమిది అని ట్రంప్ మద్దతుదారులు సమర్థిస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేయడమేనని, ట్రంప్ తన వ్యక్తిగత అహంకారాన్ని, "వ్యక్తి ఆరాధన" సంస్కృతిని దేశంపై రుద్దుతున్నారని డెమొక్రాట్లు ధ్వజమెత్తుతున్నారు.
మొత్తానికి అమెరికా కరెన్సీ హిస్టరీలో ట్రంప్ తెస్తున్న ఈ మార్పులు కేవలం ఆ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. చట్టపరమైన అడ్డంకులను దాటుకుని ట్రంప్ నాణెం మార్కెట్లోకి వస్తుందో లేదో చూడాలి.

# దేశంలోనే ఫస్ట్: ఏపీలో 'సర్' గడువు పెంపు!



దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియ ప్రస్తుతం 11 రాష్ట్రాలు 6 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాగుతోంది. వీటిలో ఒక్క తెలంగాణ మినహా.. మిగిలిన రాష్ట్రాల్లో ఈ నెల 14(మంగళవారం)తో సర్ ఫారాలను తీసుకునే కార్యక్రమం, ఇంటింటి సర్వే వంటివి ముగిసిపోయాయి. ఈ నేపథ్యంలో ఏపీకి సంబంధించి మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది.
ఏపీలో చేపట్టిన సర్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని.. చేయాల్సింది చాలా ఉందని రాష్ట్రంలోని పలు పార్టీ లు, ప్రజా సంఘాలు రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతా లు, ఎస్సీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సర్ ప్రక్రియ పూర్తికాలేదని వివరించారు. దీంతో ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.అయితే.. ఇలాంటి విజ్ఞాపనలు గతంలోనూ పలు రాష్ట్రాల నుంచి కేంద్ర ఎన్నికల సంఘానికి అందాయి. కానీ, అప్పట్లో వాటిని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది.
ఇచ్చిన గడువు లోపే.. పూర్తి చేయాలని ఆదేశించింది. కానీ, తొలిసారి ఏపీకి సంబంధించి మాత్రం పది రోజుల పాటు వెసులుబాటు కల్పించింది. ఈ నెల 14(మంగళవారం)తో ముగిసిపోయినప్పటికీ.. సర్ ఫారాలను తీసుకునే కార్యక్రమం, ఇంటింటికీ బూత్ లెవిల్ ఆఫీసర్లు వెళ్లే కార్యక్రమాన్ని ఈ నెల 24 వరకు అంటే.. 10 రోజుల పాటు పొడిగించడం విశేషం. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇదీ.. తాజా షెడ్యూల్..**
ం ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు తుదిగడువు: 24-07-2026
బూత్‌లెవిల్ ఆఫీసర్లు.. ఇంటింటికీ తిరగాల్సిన తుది గడువు: 24-07-2026
పోలింగ్ కేంద్రాల గుర్తింపు ఆఖరు తేదీ: 24-07-2026
ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించే తేదీ : 31-07-2026(గతంలో 21-07-2026)
ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తీసుకునే గడువు: 31-07-2026-30-08-2026
అభ్యంతరాలు పరిష్కరించే గడువు: 31-07-2026-28-09-2026
తుది ఓటరు జాబితా ప్రకటించే తేదీ: 03-10-2026

ప్రపంచ విద్యా చిత్రపటంలో భారత్ మళ్లీ తనదైన ముద్ర వేసుకుంటోంది. ఒకనాడు నలంద, తక్షశిల, విక్రమశిల విశ్వవిద్యాలయాల్లో దేశదేశాల విద్యార్థులు జ్ఞానాన్వేషణ చేసిన ఘన చరిత్ర మనది. చైనా యాత్రికులు హ్యుయాన్‌త్సాంగ్, ఫాహియాన్ వంటివారు వేల మైళ్లు ప్రయాణించి మరీ ఇక్కడి విద్యాలయాల్లో అభ్యసించారంటే.. అప్పట్లో భారతావని జ్ఞానకేంద్రంగా ఎంతటి వైభవాన్ని అనుభవించిందో అర్థం చేసుకోవచ్చు. శతాబ్దాల విదేశీ పాలన, అనంతర పరిణామాల్లో ఆ ప్రాభవం మసకబారినా.. నేడు మళ్లీ అంతర్జాతీయ విద్యార్థులకు భారత్ ఆకర్షణీయ గమ్యంగా రూపుదిద్దుకుంటోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ విడుదల చేసిన 'అఖిల భారత ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2023-24' ఈ వాస్తవాన్ని గణాంకాలతో సహా నిరూపించింది. ఏకంగా 173 దేశాలనుంచి 58,134 మంది విదేశీ విద్యార్థులు భారత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదువుకుంటున్నారని సర్వే తేల్చింది. 2019-20లో 48,898గా ఉన్న ఈ సంఖ్య ఐదేళ్లలో 9,236 మేర పెరిగి 18.9 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. పొరుగుదేశం నేపాల్ నుంచే అత్యధికంగా 24.1 శాతం విద్యార్థులు వస్తుండగా.. యూఏఈ, అమెరికా, బంగ్లాదేశ్, నైజీరియా, జింబాబ్వే తర్వాతి స్థానాల్లో నిలిచాయి. లెబనాన్, బుర్కినాఫాసో, మంగోలియా, మెక్సికో, కజకిస్థాన్, బెలారస్, చిలీవంటి సుదూర దేశాల విద్యార్థులు సైతం భారత విద్యాసంస్థల వైపు చూస్తుండటం గమనార్హం. రాష్ట్రాలవారీగా చూస్తే 7,914 మంది విదేశీ విద్యార్థులతో కర్ణాటక టాప్‌లోవుంటే.. 7,902 మందితో పంజాబ్ రెండో స్థానానికి పరిమితమైంది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు తొలి ఐదుస్థానాల్లో నిలిచాయి. బెంగళూరు వంటి నగరాలు ఐటీ రాజధానులుగా, విద్యా కేంద్రాలుగా అంతర్జాతీయ ఖ్యాతి గడించడమే కర్ణాటక ఆధిక్యానికి కారణమనేది సుస్పష్టం. వచ్చే విద్యార్థుల్లో 73.6 శాతంమంది డిగ్రీ కోర్సుల్లో, 16.8 శాతంమంది పీజీ ప్రోగ్రాముల్లో చేరుతుండటం.. భారత ఉన్నత విద్యపై ప్రపంచ యువతలో పెరుగుతున్న విశ్వాసానికి నిలువుటద్దం!

నిజానికి -ప్రపంచవ్యాప్తంగా సరిహద్దులు దాటి చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య 65 లక్షలకు పైమాటే. అందులో భారత్‌కు దక్కుతున్న వాటా 58 వేలంటే.. ఒక్క శాతం కూడా కాదన్నది చేదు నిజం! అమెరికా పది లక్షలకు పైగా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా చెరో ఐదారు లక్షలమంది అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షిస్తుంటే.. 1,100కి పైగా విశ్వవిద్యాలయాలు, 50 వేలకు పైగా కళాశాలలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇంత వెనుకబడటం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమే. మరోవైపు ఏటా ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు విదేశీ బాట పడుతూ లక్షల కోట్ల రూపాయలను విదేశీ మారక ద్రవ్యం రూపంలో బయటకు తరలిస్తున్నారు. అంటే మనం 'పంపే' విద్యార్థులకు, 'రప్పించుకునే' విద్యార్థులకు మధ్య అగాధమంత అంతరం నెలకొందన్నమాట! ఈ అసమతుల్యతను సరిదిద్దకుండా విద్యారంగంలో 'విశ్వగురు' హోదా సాధించడం అసాధ్యం! మనవద్దకు వస్తున్న విద్యార్థుల్లో అత్యధికులు నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్రికా దేశాలవారే తప్ప.. అభివృద్ధి చెందిన దేశాలనుంచి వచ్చేవారి సంఖ్య పరిమితమే. అంతర్జాతీయ ర్యాంకింగుల్లో భారత విద్యాసంస్థల స్థానం

## జ్ఞానభూమి పిలుపు!


ఆశించిన స్థాయిలో లేకపోవడం, పరిశోధనలపై పెట్టుబడులు జీడీపీలో ఒక శాతానికి లోబడే ఉండటం, బోధన సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్ల సమస్యలు, వీసా ప్రక్రియలో జాప్యాలు.. ఇవన్నీ విదేశీ విద్యార్థుల రాకకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఆఫ్రికా దేశాల విద్యార్థులపై అక్కడక్కడా చోటుచేసుకున్న వివక్షాపూరిత ఘటనలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిన సందర్భాలూ లేకపోలేదు. విదేశీ విద్యార్థుల్లో మహిళల సంఖ్య 20,839కి పెరగడం సానుకూలాంశమే అయినా.. పురుషులతో పోలిస్తే (37,295) ఇంకా చాలా తక్కువే. భద్రత, వసతి సదుపాయాలపై మరింత భరోసా కల్పిస్తేనే ఈ అంతరమూ తగ్గుతుంది. ఉత్తమ శ్రేణి విద్య, తక్కువ ఖర్చు, ఆంగ్ల మాధ్యమం, సాంస్కృతిక వైవిధ్యంవంటి బలాలు మనకున్నా.. వాటిని ప్రపంచానికి సమర్థంగా చాటిచెప్పడంలో వెనుకబడుతున్నామన్నది కఠోర వాస్తవం.

ఈ సవాళ్లను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రారంభించిన 'స్టడీ ఇన్ ఇండియా' కార్యక్రమం సరైన దిశలో పడిన తొలి అడుగు. జాతీయ విద్యా

## సంపాదకీయం

విధానం-2020 సైతం భారత్‌ను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని స్పష్టంగా ప్రకటించింది. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు నెలకొల్పేందుకు యూజీసీ నిబంధనలను సరళీకరించడం, గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ప్రతిష్ఠాత్మక విదేశీ వర్సిటీలు అడుగుపెట్టడం, ఐఐటీలు మద్రాస్, ఢిల్లీవంటివి జాంజిబార్, అబుదాబిల్లో క్యాంపస్‌లు ప్రారంభించడం.. ఈ పరిణామాలన్నీ భారత విద్యారంగ అంతర్జాతీయాకరణకు ఊతమిచ్చేవే. అయితే ప్రకటనలు, విధానాలతోనే సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠ చర్యలు చేపట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయి. విదేశీ విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియను మరింత సులభతరం, వేగవంతం చేయాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన హాస్టళ్లు, ప్రయోగశాలలు, డిజిటల్ మౌలిక వసతులను విద్యాసంస్థల్లో సమకూర్చాలి. ఉపకార వేతనాలను గణనీయంగా పెంచి ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను ఆకర్షించాలి. చదువు పూర్తయ్యాక కొంతకాలం ఇక్కడే పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తే.. అమెరికా, కెనడాల తరహాలో భారత్ సైతం ప్రతిభావంతులకు గమ్యస్థానంగా మారుతుంది. పరిశోధనలపై పెట్టుబడులను పెంచి, పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి, అంతర్జాతీయ ర్యాంకింగుల్లో మన వర్సిటీల స్థానాన్ని మెరుగుపరచడమూ అత్యవసరమే. నేపాల్ మొదలు జింబాబ్వే దాకా విస్తరించిన ఈ విద్యా బంధాలే భవిష్యత్తులో వాణిజ్య, దౌత్య సంబంధాలకు వారధులవుతాయి. ఐదేళ్లలో 18.9 శాతం వృద్ధి ఆహ్వానించదగినదే అయినా.. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్న భారత్‌కు ఇది ఏమాత్రం సరిపోదు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. విద్యారంగంలో ప్రపంచ నాయకత్వం అనివార్యం. ప్రాచీన నలందా వైభవాన్ని ఆధునిక రూపంలో పునరుద్ధరించి, 'చదువుల చిరునామా'గా భారత్ మళ్లీ ప్రపంచ పటంపై ప్రకాశించాలంటే.. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, సమాజం సమష్టిగా కదలాల్సిన తరుణమిదే!

### పనికొచ్చే పలుకు



## జ్ఞానమే కాదు.. సాధనా ఉండాలి!

"తెలిసి ఉండడం మాత్రమే సరిపోదు, దానిని ఆచరణలో పెట్టాలి. కోరిక ఉంటేనే సరిపోదు, దానిని చేసి చూపించాలి" అని జర్మనీకి చెందిన ప్రసిద్ధ మేధావి జోహాన్ వోల్ఫ్‌గ్యాంగ్ వాన్ గోథే పేర్కొన్నారు. ఈ మాటలు చదవడానికి ఎంతో సరళంగా అనిపించినప్పటికీ, వీటి వెనుక ఎంతో లోతైన అర్థం దాగి ఉంది. కేవలం ఆలోచనలకు పరిమితం కాకుండా, వాటిని కార్యాచరణలో పెట్టినప్పుడే నిజమైన విజయం లభిస్తుందని కాలాతీత సూక్తి మనకు గుర్తుచేస్తోంది.

జర్మన్ సాహిత్య చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో గోథే ఒకరు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాదు; ఒక తత్వవేత్తగా, శాస్త్రవేత్తగా, రాజకీయ నాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించారు. ఆయన రాసిన 'ఫాస్ట్', 'ది సారోస్ ఆఫ్ యంగ్ వెర్దర్' వంటి రచనలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఆయన చెప్పిన ఈ మాటలు శతాబ్దాలు దాటినా నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. కేవలం ఆలోచనలు ఉండడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, వాటిని చేతల్లో చూపించినప్పుడే వాటికి విలువ వస్తుందనేది ఆయన ప్రతిపాదించిన ప్రధాన తత్వం.

ఈ సూక్తి అంతరార్థం ఏమిటి?

సాధారణంగా మనలో చాలా మందికి జీవితంలో ఏం చేయాలో, ఏది మంచో ఏది చెడో బాగా తెలుసు. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తినాలని, రోజూ వ్యాయామం చేయాలని, భవిష్యత్తు కోసం డబ్బు దాచుకోవాలని, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలని అందరికీ అవగాహన ఉంటుంది. జీవితాన్ని మార్చుకోవాలనే కోరిక కూడా ఉంటుంది. కానీ, ఆచరణ విషయానికి వచ్చేసరికి మాత్రం వెనకడుగు వేస్తారు. ఇక్కడే గోథే సూక్తి ప్రాధాన్యత అర్థమవుతుంది. మనకు ఎంత సమాచారం ఉందనేది ముఖ్యం కాదు, దానిని ఎంతవరకు ఉపయోగించామనేదే ముఖ్యం. అలాగే మంచి సంకల్పాలు ఉండడం అభినందనీయమే అయినా, అవి స్థిరమైన ప్రయత్నంగా మారినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.

ప్రస్తుత 2026 నాటి ఆధునిక ప్రపంచంలో సమాచారం మన వేలికొనలపైనే లభిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పెట్టుబడులు, ఫిట్‌నెస్, వ్యాపార సూత్రాలు.. ఇలా ఏ విషయాన్నైనా ఇంటర్నెట్ ద్వారా కొన్ని క్లిక్కులతో నేర్చుకోవచ్చు. ఎన్నో పాడ్‌కాస్ట్‌లు, పుస్తకాలు, వీడియోలు, ఆన్‌లైన్ కోర్సులు మనకు అందుబాటులో ఉన్నాయి. అయితే, జ్ఞానాన్ని సేకరించడం వేరు, దాని ద్వారా ఫలితాలను సాధించడం వేరు. నాయకత్వం గురించి పుస్తకాలు చదివినంత మాత్రాన ఎవరూ నాయకులు అయిపోరు. ఫిట్‌నెస్ వీడియోలు చూసినంత మాత్రాన ఆరోగ్యం చేకూరదు. అన్నీ పరిపూర్ణంగా ఉండే వరకు వేచి చూడకుండా, వెంటనే రంగంలోకి దిగి పనిని ప్రారంభించేవారే నిజమైన విజేతలుగా నిలుస్తారు.

'సరైన సమయం' కోసం వేచి చూడకండి

వ్యక్తిగత ఎదుగుదలకు అడ్డుపడే అతిపెద్ద ఆటంకం ఏమిటంటే, 'సరైన సమయం' కోసం వేచి చూడడం. మరింత ఆత్మవిశ్వాసం వచ్చాక లేదా పూర్తి సన్నద్ధత సాధించాక నిర్ణయాలు తీసుకుందామని చాలా మంది పనులను వాయిదా వేస్తుంటారు. కానీ నిజానికి, పనిని ప్రారంభించిన తర్వాతే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి నిపుణుడు కూడా ఒకప్పుడు సందేహాలతోనే తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన సాధారణ వ్యక్తనే విషయాన్ని మరువకూడదు. విజయం అనేది ఒకే రోజులో వచ్చేది కాదు, నిరంతర ఆచరణ ద్వారానే సాధ్యమవుతుంది.

జ్ఞానమనేది పునాది అయితే, మంచి ఆలోచన ఒక చిన్న నిప్పుకణిక లాంటిది. కానీ మార్పును సృష్టించేది మాత్రం కేవలం కార్యాచరణే. కలలు నిజం కావాలంటే నిద్ర లేచి వాటి వెనుక పరుగెత్తడం ప్రారంభించాల్సిందే!

# కునుకే కురిపించును.. క్షేమం!


గాలి, నీరు, ఆహారం తర్వాత జీవానికి అంతే అవసరమైనది నిద్ర. మనం నిశ్చలంగా కళ్లు మూసిన ఆ ఘడియల్లోనే శరీరం లోలోపల కణాల మరమ్మతుల మహా యజ్ఞాన్ని నడిపిస్తుంది. కానీ నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో ప్రశాంతమైన కునుకు అరుదైన వరంగా మారిపోయింది. నిద్రలేమి రుగ్మతలతో కోట్లాది మంది సతమతమవుతూ.. మాత్రల వైపు పరుగులు తీస్తూ సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారు. ఆరోగ్యం, ఆనందం, ఆయుష్షు.. ఈ మూడింటికీ పునాది వేసే నిదుర 'ఔషధం' విలువను గుర్తెరగాల్సిన తరుణమిదే!



మనిషి జీవితకాలంలో దాదాపు మూడో వంతు నిద్రలోనే గడిచిపోతుంది. అయినా ఆ అమూల్య సమయాన్ని మనం ఏనాడూ విలువైనదిగా పరిగణించం. నిజానికి నిద్ర అనేది ధ్యానానికి దగ్గరగా నిలిచే అత్యుత్తమ విశ్రాంతి సాధనం. అందుకే హాయిగా నిద్రపోగలిగినవారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారన్నది అనుభవసిద్ధ సత్యం. రాత్రి కంటినిండా కునుకు తీసినవారు మరునాడు ఉదయం తాజాదనంతో, ఉత్సాహంతో, రెట్టించిన శక్తితో మేల్కొంటారు. కానీ నేటి ఉరుకుల పరుగుల ప్రపంచంలో ప్రశాంతమైన నిద్ర అరుదైన వరంగా మారిపోయింది. స్లీప్ అప్నియా, ఇన్‌సోమ్నియా (నిద్రలేమి), రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్, నార్కోలెప్సీ వంటి నిద్ర సంబంధిత రుగ్మతలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది సతమతమవుతున్నారు. ఇక అర్ధరాత్రి వరకూ అటూఇటూ దొర్లుతూ.. మధ్యమధ్యలో మెలకువ వచ్చేస్తూ.. తునాతునకలైన నిద్రతో నెట్టుకొచ్చేవారి సంఖ్య అంతకు ఎన్నో రెట్లు అధికం. విషాదమేమిటంటే.. వీరిలో చాలామంది నిద్రమాత్రలు, మత్తుమందుల వైపు మొగ్గుచూపుతూ సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారు. నిద్రలేమిని అసలు తీవ్రమైన సమస్యగా భావించకపోవడమే ఈ నిర్లక్ష్యానికి మూలకారణం. మరునాటి కోసం శరీరానికి అవసరమైన శక్తిని పునరుద్ధరించే ప్రక్రియకు ఈ రుగ్మతలు తీవ్ర విఘాతం కలిగిస్తాయన్న వాస్తవాన్ని మనం సౌకర్యంగా విస్మరిస్తున్నాం. నిద్రను కేవలం శరీరం పనిచేయని 'జడ సమయం'గా చూడటం మనం చేస్తున్న పెద్ద పొరపాటు. వాస్తవమేమిటంటే.. మనం అత్యంత నిశ్చలంగా కనిపించే ఆ నిద్రా ఘడియల్లోనే మన లోపల ఏదో ఒక శక్తి అత్యంత చురుగ్గా పనిచేస్తూ.. మరుసటి రోజు కోసం శరీర కణాలను రీఛార్జ్ చేస్తుంటుంది. కంటికి కునుకు పడుతున్న ప్రతి క్షణం.. లోలోపల ఒక మహా యజ్ఞమే జరుగుతోందన్నమాట!

అలసటను జయించే అతిపెద్ద దివ్యౌషధం నిద్రేనన్నది నిర్వివాదాంశం. శరీరానికి అవసరమైనప్పుడు అది మనల్ని అమాంతం ఆవహించేస్తుంది. నిద్రను కొంతసేపు వాయిదా వేయగలమేమో కానీ.. శాశ్వతంగా దూరం పెట్టడం అసంభవం. కండరాలను, నరాలను, మెదడు కణాలను తిరిగి క్రియాశీలం చేసే ఆరోగ్యదాయకమైన, ఆహ్లాదకరమైన నిద్ర.. ప్రకృతి ప్రసాదించిన గొప్ప పునరుజ్జీవన వరాల్లో ఒకటి. అందుకే గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో.. జీవితానికి నిద్రా అంతే అత్యవసరం. మనం నిద్రించే వేళల్లో శరీరం ఎంతో బిజీగా ఉంటుంది. కణజాలాల మరమ్మతులు, గాయాల మానుపు, అవయవాలకూ కణాలకూ ఇంధనం నింపడం, పాత కణాల స్థానంలో కొత్తవాటిని సృష్టించడం.. ఇలా ఎన్నో కీలక ప్రక్రియలు అప్పుడే సాగుతాయి. మెలకువగా ఉన్నప్పటికంటే నిద్రలోనే ఈ పునర్నిర్మాణ కార్యక్రమాలు ఎన్నో రెట్లు వేగంగా జరుగుతాయని వైద్యశాస్త్రం చెబుతోంది. మరి ఇంతటి విలువైన నిద్రకు అతిపెద్ద అవరోధం ఏమిటి? నిస్సందేహంగా అది మానసిక అనారోగ్యమే! పగటిపూట మనం అలవాటుగా చేసే ప్రతికూల ఆలోచనలు, అనుచిత చర్యలే రాత్రిపూట నిద్రకు భంగం కలిగిస్తాయి. అంతరాత్మ హెచ్చరికలను పదేపదే అణచివేయడం మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసి.. ప్రతికూల వ్యక్తిత్వ లక్షణాలకూ, నిద్రలేమికీ దారితీస్తుంది. అంటే మనసు నిర్మలంగా ఉంటేనే నిద్ర నిష్కల్మషంగా ఉంటుందన్నమాట! నిద్రను ప్రభావితం చేసే మరో కీలకాంశం మనం తీసుకునే ఆహారం. మానసిక ఆరోగ్యం క్షీణిస్తే ఆహారపు అలవాట్లు గాడి తప్పుతాయని, అవి నిద్రనూ ఆరోగ్యాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వైద్యపరంగా రుజువైంది. రోజుకు అనేక కప్పుల టీ, కాఫీ, శీతల పానీయాలు సేవించేవారి శరీరంలోకి పెద్ద మొత్తంలో కెఫీన్ చేరి.. వారి నిద్రను హరించివేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సరైన ధ్యాన పద్ధతులను క్రమం తప్పకుండా సాధన చేస్తే అద్భుత ఫలితాలుంటాయని నిపుణులు సూచిస్తున్నారు. కాఫీ కప్పుల్లో వెతుక్కునే ఉత్తేజం తాత్కాలికమే.. కంటినిండా నిద్రలో దొరికే శక్తే శాశ్వతం!

ఇక 'ఎన్ని గంటలు నిద్రపోవాలి?' అన్న ప్రశ్నపై ఎప్పటినుంచో చర్చోపచర్చలు సాగుతూనే ఉన్నాయి. వేర్వేరు పరిస్థితులకు వేర్వేరు నిడివుల నిద్ర అవసరమన్నది వైద్యుల సమాధానం. స్వచ్ఛమైన గాలి, మంచి నీరు, పోషకాహారం, తగినంత శారీరక శ్రమ లేదా వ్యాయామం, సానుకూల వాతావరణం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉంటే.. శరీరానికి ఎంత అవసరమో అంతసేపు నిద్ర దానంతట అదే పడుతుంది. నిరంతరం ధ్యానస్థితిలో ఉండే యోగుల వంటివారికి నాలుగైదు గంటల నిద్ర చాలు. మరికొందరికి అంతకుమించి అవసరం కావచ్చు. వయసు, సాధారణ శారీరక ఆరోగ్యం, పని దినచర్య, పరిసరాలు, నివాస వాతావరణం.. ఇవన్నీ మనకు అవసరమైన నిద్ర గంటలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే.. నిద్ర తన ప్రయోజనాన్ని నెరవేర్చుకున్నాక మన చైతన్యం దానంతట అదే తిరిగివస్తుంది. కాబట్టి 'అతినిద్ర' అనేదే ఉండదు! కానీ 'నిద్రలేమి' అనే దురవస్థ మాత్రం కచ్చితంగా ఉంది. ఎందుకంటే ఏదోక కారణంతో.. జీవితంలోని ఇతర సుఖాల వెంట పరుగులు తీస్తూ మనం నిద్రను బలిపెడుతున్నాం. అర్ధరాత్రి దాటినా వదలని సెల్‌ఫోన్ తెరలు, ఓటీటీ వినోదాలు, సామాజిక మాధ్యమాల స్క్రోలింగ్‌లు.. నేటితరం నిద్రను నిలువునా దోచేస్తున్నాయి. 'పెందలకడ నిద్రించి, వేకువనే మేల్కొనేవాడు ఆరోగ్యవంతుడు, ధనవంతుడు, జ్ఞానవంతుడు అవుతాడు' అన్న పెద్దల సూక్తి నేటికాలంలో చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది. చిల్లర కారణాల కోసం నిద్రను పణంగా పెడితే.. తెలిసి తెలిసీ మన ఆరోగ్యాన్ని మనమే కూల్చుకున్నట్టే. కంటినిండా నిద్ర లేకుంటే ఏకాగ్రత సన్నగిల్లుతుంది, జ్ఞాపకశక్తి మందగిస్తుంది, రోగనిరోధక శక్తి క్షీణిస్తుంది, చిరాకు పెరిగి మానవ సంబంధాలూ దెబ్బతింటాయి. అందుకే విజ్ఞత ప్రదర్శించి.. మన ఆరోగ్య ప్రయోజనాల కోసమే నిద్రకు పెద్దపీట వేద్దాం. ప్రతిరోజూ పడక ఎక్కేముందు మనసును ఆలోచనల నుంచి విడిపించి.. నిద్రను ఆహ్వానించే ప్రశాంతతను అలవరచుకుందాం. పగలంతా శ్రమించే శరీరానికి రాత్రి నిద్ర ఇచ్చే బహుమతే.. మరునాటి విజయాలకు పెట్టుబడి. ఆ పెట్టుబడిని నిర్లక్ష్యం చేసినవాడు జీవితంలో నష్టపోక తప్పదు. కాసుల కోసం కునుకును త్యాగం చేసేవారు.. చివరకు ఆ కాసులన్నీ కునుకు కోసమే ఖర్చు చేయాల్సి వస్తుందన్న హెచ్చరికను మరవొద్దు. నిద్రే నిజమైన సిరి.. ఆ సిరిని కాపాడుకున్నవాడే అసలైన ధనవంతుడు! ■



ఇప్పుడిప్పుడే కెరీర్‌లో ముందడుగు వేస్తున్నారా? అయితే, దానికిముందే -మీ గురించి ఓ బలమైన నమ్మకాన్ని, అభిప్రాయాన్ని మీరున్న ప్రపంచానికి చెప్పండి. మీరెలాంటి వారో, ఎలాంటి వారు కాదో మీ చుట్టూవున్న ప్రపంచానికి కచ్చితంగా తెలియాలి. ఆ స్పష్టత ఇవ్వకుంటే.. ఆ ప్రపంచమే మీరెలాంటి వారో దానికి నచ్చినట్టు నిర్వచించేస్తుంది. కాలక్రమేణా ఆ అబద్ధాన్నే నిజమని నమ్మడం మొదలవుతుంది. మీ గురించి మీరు రాసుకోని కథను.. లోకం తన ఇష్టమొచ్చినట్టు రాసేస్తుంది. అదే సమస్య! అందుకే -మీ జీవిత కథకు రచయిత మీరే కావాలి!

-మహాదేవ

### వింతల్లో వింతలు

## 'కంటి'కి కనిపించని కాపీ!



చైనా వర్సిటీ పరీక్షలు అత్యంత కఠినమనేది తెలిసిందే. అందుకే విద్యార్థులు ఇప్పుడు కాపీయింగ్‌కు ఏఐ కళ్లద్దాలు వాడేస్తున్నారట. జులై 1న గ్వాంగ్‌జౌలోని సౌత్ చైనా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో లిన్ అనే విద్యార్థి ఇలాగే దొరికిపోయాడు. పరీక్ష మొదలైన పది నిమిషాలకే అతడి కళ్లద్దాల లెన్సుల్లో ఆకుపచ్చ వెల్తురు ఇన్విజిలేటర్ కంటపడింది. అతడు ధరించినవి 'లెకీ స్మార్ట్ గ్లాసెస్' -డీప్‌సీక్ సహా నాలుగు ఏఐ మోడళ్లు ఇమిడిన అద్దాలవి. కణతల వద్ద ఫ్రేమ్‌ను తాకితే చాలు, ప్రశ్నపత్రం ఫొటో తీసి క్షణాల్లో జవాబులు చూపిస్తాయి. ఈ ఉదంతం వైరల్ కాగానే, ఆ ఆకుపచ్చ వెలుగును చౌక స్టిక్కర్లతో దాచొచ్చంటూ నెటిజన్లు 'చిట్కాలు' పంచుకోవడం విశేషం. కేవలం హుబెయ్, హెనాన్, బీజింగ్ వర్సిటీల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. భవిష్యత్తులో ఏఐ అద్దాలను సాధారణ కళ్లద్దాల నుంచి వేరు చేసి గుర్తించడమే కష్టమవుతుందని నిపుణులు హెచ్చరిస్తుండటం ఇన్విజిలేటర్లకు పెను సవాలే!

# ఎండాకాలంలో మంచి మిత్రుడు... ఈ పండు!

- వేసవిలో వేడి నుంచి ఉపశమనం ఇచ్చే కర్బూజా
- శరీరానికి కావాల్సిన నీటిని అందించి చల్లబరిచే గుణం
- రోగనిరోధక శక్తిని పెంచి, కంటి చూపును మెరుగుపరిచే విటమిన్లు
- బరువు తగ్గడంలో సహాయపడే ఫైబర్, తక్కువ క్యాలరీలు
- చర్మ సౌందర్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని కాపాడే గుణాలు



మండే ఎండలు, పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న వేళ.. మన శరీరానికి చల్లదనాన్ని, ఉపశమనాన్ని ఇచ్చే అద్భుతమైన పండు కర్బూజా. అందుకే దీన్ని వేసవి కాలంలో మంచి మిత్రుడు అని పిలుస్తారు. ఇందులో 90 శాతానికి పైగా నీరే ఉండటం వల్ల, ఇది శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడి, తక్షణ శక్తిని అందిస్తుంది. కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, కర్బూజాలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలున్నాయి. విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ ఏ, బీటా కెరోటిన్‌లు కంటి చూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీనిలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సులభతరం చేసి, మలబద్ధకం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మంచి ఎంపిక. కర్బూజాలో క్యాలరీలు, కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతేకాదు, వేసవిలో తీవ్రంగా వేధించే వడదెబ్బ నుంచి కూడా ఇది రక్షణ కల్పిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే, ఇన్ని ప్రయోజనాలున్నాయని అతిగా తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మితంగా తీసుకుంటేనే కర్బూజా పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు.

# డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తింటున్నారా... అయితే ఇది మీకోసమే!

- అతిగా డ్రై ఫ్రూట్స్ తింటే అనారోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు
- బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, బ్లడ్ షుగర్ పెరుగుదల ప్రధాన దుష్ప్రభావాలు
- రోజుకు 20 నుంచి 30 గ్రాముల డ్రై ఫ్రూట్స్ మాత్రమే తీసుకోవాలని నిపుణుల సూచన
- డయాబెటిస్, అధిక బరువు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి



ఆరోగ్యకరమైన స్నాక్స్ అనగానే చాలామందికి డ్రై ఫ్రూట్స్ గుర్తొస్తాయి. వీటిలో పోషకాలు సమృద్ధిగా ఉండటం, తక్షణ శక్తినివ్వడంతో చాలామంది రోజూ తీసుకుంటారు. అయితే, ఆరోగ్యానికి మంచిది కదా అని వీటిని కూడా అతిగా తినడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎందుకంత ప్రమాదం?**

బాదం, వాల్‌నట్, జీడిపప్పు, ఎండు ద్రాక్ష వంటి డ్రై ఫ్రూట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు, శరీరానికి శక్తిని అందిస్తాయి. కానీ, వీటిలో క్యాలరీలు, సహజ చక్కెరల శాతం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని మోతాదుకు మించి తీసుకోవడం వల్ల పలు దుష్ప్రభావాలు ఎదురవుతాయి.

**అతిగా తింటే ఏమవుతుంది?**

బరువు పెరగడం: డ్రై ఫ్రూట్స్‌లో క్యాలరీలు అధికంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా తింటే శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి సులభంగా బరువు పెరుగుతారు.

జీర్ణ సమస్యలు: వీటిలో ఉండే అధిక ఫైబర్ వల్ల ఎక్కువగా తిన్నప్పుడు కడుపు ఉబ్బరం, గ్యాస్, కొన్నిసార్లు డయేరియా వంటి సమస్యలు తలెత్తుతాయి.

బ్లడ్ షుగర్ స్పైక్స్: ముఖ్యంగా ఎండు ద్రాక్ష, ఖర్జూరం వంటి వాటిలో సహజ చక్కెరలు ఎక్కువ. వీటిని అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి మరింత ప్రమాదకరం.

**రోజుకు ఎంత తినాలి?**

ఆరోగ్యంగా ఉన్న పెద్దలు రోజుకు ఒక చిన్న గుప్పెడు (సుమారు 20-30 గ్రాములు) డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది. ఉదాహరణకు 5-6 బాదం పప్పులు, 2-3 వాల్‌నట్స్, కొన్ని ఎండు ద్రాక్షలు కలిపి తీసుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు, మధుమేహులు, జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఉదయం పూట లేదా వ్యాయామానికి ముందు వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ఎంత ఆరోగ్యకరమైన ఆహారమైనా మితంగా తీసుకున్నప్పుడే దాని పూర్తి ప్రయోజనాలు అందుతాయని గుర్తుంచుకోవాలి.

# విటమిన్ 'సి'తో ఇమ్యూనిటీకి భరోసా.. ఈ ఆహారాలు రోజూ తీసుకుంటున్నారా?

- శరీరానికి రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ సి కీలకం
- ఉసిరి, నారింజ, జామ వంటి పండ్లలో విటమిన్ సి పుష్కలం
- విటమిన్ సి చర్మ ఆరోగ్యాన్ని, జీర్ణశక్తిని కూడా మెరుగుపరుస్తుంది
- క్యాప్సికం, బ్రోకలి వంటి కూరగాయలు కూడా మంచి ఎంపిక




**మారుతున్న జీవనశైలి, వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి రోగనిరోధక శక్తి ఎంతో ముఖ్యం. ఈ ఇమ్యూనిటీని సహజసిద్ధంగా పెంపొందించడంలో విటమిన్ 'సి' కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షించడమే కాకుండా చర్మ ఆరోగ్యాన్ని, జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కొన్ని ముఖ్యమైన ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

మనకు విటమిన్ 'సి' అనగానే గుర్తొచ్చే వాటిలో ఉసిరి, నారింజ, నిమ్మకాయ ప్రధానమైనవి. ఉసిరి రోగనిరోధక శక్తిని అద్భుతంగా పెంచుతుంది. నారింజ పండు శరీరంలో కొల్లాజెన్ తయారీకి సహాయపడి అలసటను దూరం చేస్తుంది. నిమ్మకాయ శరీరాన్ని డీటాక్స్ చేసి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. జామపండు కూడా విటమిన్ సి కి మంచి మూలం. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచి, శరీర రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది. వీటితో పాటు బొప్పాయి, స్ట్రాబెర్రీలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బొప్పాయి జీర్ణవ్యవస్థకు మేలు చేయగా, స్ట్రాబెర్రీలు గుండె ఆరోగ్యానికి, చర్మ కాంతికి దోహదపడతాయి. కూరగాయల విషయానికి వస్తే, క్యాప్సికం కంటి ఆరోగ్యానికి, చర్మానికి మేలు చేస్తుంది. బ్రోకోలి వంటివి కూడా పోషకాలతో నిండి ఉండి, జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ పండ్లు, కూరగాయలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా సహజంగానే ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## అత్తాకోడళ్ల మధ్య రోజూ గొడవలా ?

# ఇంట్లో ఈ మార్పులు చేయండి.. ప్రశాంతంగా, సంతోషంగా మారుతుంది!



మీ ఇంట్లో అత్తాకోడళ్ల మధ్య రోజూ గొడవలు జరుగుతున్నాయా.. ? ఏం చేయాలో తెలియక విసిగిపోయారా..? అయితే మీ ఇంట్లో చిన్న చిన్న మార్పులు చేసి చూడండి.. మళ్లీ మీ ఇంట్లో ప్రశాంతత, సంతోషం తిరిగి వస్తాయి. ఈ రోజుల్లో అత్తాకోడళ్ల మధ్య చిన్న చిన్న గొడవలు సహజమే. కానీ, అవి పెరిగి పెద్దవైనప్పుడు ఇంట్లో అందరికీ మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఇంటి ప్రశాంతత పాడవుతుంది. అయితే, ఈ గొడవలకు ఇంట్లోని వాస్తు దోషాలు కూడా ఒక కారణం కావచ్చని మీకు తెలుసా?

వాస్తు శాస్త్రం ప్రకారం.. ఇంట్లో నెగిటివ్ ఎనర్జీ ఉంటే కుటుంబికుల మధ్య గొడవలు జరుగుతాయి. అలాంటప్పుడు కొన్ని చిన్న చిన్న వాస్తు చిట్కాలు పాటిస్తే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూద్దాం:

**అత్తాకోడళ్ల మధ్య గొడవలు తగ్గడానికి వాస్తు చిట్కాలు:**

కిచెన్ క్యాబినెట్లకు నలుపు రంగు : వాస్తు ప్రకారం వంటగదిలోని క్యాబినెట్లకు లేదా అరలకు నలుపు రంగు అస్సలు వాడకూడదు. నల్ల రంగు వల్ల ఇంట్లోని ఆడవారికి మానసిక ఒత్తిడి పెరుగుతుందని, అత్తాకోడళ్ల మధ్య సంబంధాలు దెబ్బతింటాయని నమ్ముతారు.

వంటగది ఏ దిశలో ఉండాలి : ఇల్లు మధ్య భాగంలో వంటగది ఉంటే ఆ ఇంట్లో ఎప్పుడూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. అలాగే, ఈశాన్యం (నార్త్-ఈస్ట్) దిశలో వంటగది ఉండటం వల్ల కూడా అత్తాకోడళ్ల మధ్య అస్సలు పడదు. వంటగది ఎప్పుడూ ఆగ్నేయం (సౌత్-ఈస్ట్) దిశలో ఉంటేనే చాలా మంచిది. బుధవారం వినాయకుడి పూజ: అత్తాకోడళ్ల మధ్య బంధం బాగుండాలంటే.. బుధవారం పొద్దున్నే స్నానం చేసి, ఒక పీటపై వినాయకుడి విగ్రహాన్ని పెట్టుకుని పూజ చేయాలి. ఇలా భక్తితో చేయడం వల్ల వారి మధ్య కోపాలు తగ్గి, ప్రేమానురాగాలు పెరుగుతాయి.

ఇంట్లో ముళ్ల మొక్కలు : ఇంట్లో కలబంద (అలోవెరా) లాంటి ముళ్ల మొక్కలు లేదా క్యాక్టస్ లాంటివి అస్సలు పెంచకూడదు. వీటివల్ల బంధాలలో దూరం పెరుగుతుంది. వీటికి బదులుగా ఇంట్లో తులసి మొక్క లేదా మనీ ప్లాంట్ పెంచడం వల్ల ఇంట్లోకి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది.

# ఎనర్జీ ఎగ్... కమ్మని రుచి..సూపర్ వెరైటీస్..ఫుల్ ఇమ్యూనిటి పవర్


వర్షాకాలం మొదలైంది.. అడపా దడపా వర్షాలు కూడా పడుతున్నాయి. చాలామంది జలుబు.. దగ్గుతో బాధపడుతున్నారు. అందుకే కచ్చితంగా రోగనిరోధకశక్తిని పెంచుకోవాలి. దానికోసం పోషకాహారం తీసుకోవడమే సరైన మార్గం. అందుకని రోజూ తినేవాటిలో పండ్లు, తాజా కూరగాయలతో పాటు రోజుకు రెండు గుడ్లు తినాలి. అయితే రోజు ఉడకబెట్టిన గుడ్లు తినాలంటే బోర్ కడుతుంది. అలాకాకుండా ఉండాలంటే ఎగ్ బజ్జీ, ఎగ్ రోల్, పచ్చడి చేసుకుంటే పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. ఇప్పుడు వాటిని ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం. . !

కోడిగుడ్లు- నాలుగు
కారం-ఒక టీ స్పూన్
క్యారెట్ తురుము- ఒక టేబుల్ స్పూన్ (కావాలనుకుంటేనే)
ఉప్పు- తగినంత
నూనె - సరిపడా
కొత్తిమీర తరుగు - పావు కప్పు
ఉల్లిగడ్డ తరుగు - ఒక టేబుల్ స్పూన్

**ఎగ్ రోల్ తయారీ విధానం**

ఒక గిన్నెలో కోడిగుడ్ల సొన కొట్టాలి. అందులో ఉప్పు, కారం, ఉల్లిగడ్డ తరుగు, క్యారెట్ తురుము, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. స్టవ్?పై వెడల్పాటి పాన్ పెట్టి, కోడిగుడ్డు మిశ్రమంతో కాస్త పలుచగా ఆమ్లెట్ వేయాలి. రెండువైపులా బాగా కాలాక, ఒకవైపు నుంచి నెమ్మదిగా కోల్ చేయాలి ఇలా నాలుగైదు ఆమ్లెట్ రోల్స్ చేసి, వాటిని చపాతీ లేదా దోశెల్లో పెట్టుకొని తినొచ్చు. లేదంటే టొమాటో సాస్?లో నంజుకున్నా టేస్టీగా ఉంటాయి.

ఎగ్‌పచ్చడి తయారీకి కావాల్సినవి
కోడిగుడ్లు - మూడు (ఉడికించినవి)
గరం మసాలా- రెండు టేబుల్ స్పూన్లు
**మెంతి పొడి-ఒకటి స్పూన్**
ఆవాల పొడి - ఒక టేబుల్ స్పూన్
అల్లం-వెల్లుల్లి పేస్ట్ - ఒక టీ స్పూన్
ఉప్పు తగినంత
నూనె - మూడు టేబుల్ స్పూన్లు
కరివేపాకు - రెండు రెమ్మలు
కారం- ఒక టేబుల్ స్పూన్
ఆవాలు- ఒక టీస్పూన్
జీలకర్ర - ఒక టీ స్పూన్
నిమ్మకాయ ఒకటి
కొత్తిమీర - పావు కప్పు



**ఎగ్ పచ్చడి తయారీ విధానం**

ఉడికించిన గుడ్ల పొట్టు తీసి పక్కనబెట్టుకోవాలి. స్టవ్? పై వెడల్పాటి గిన్నెపెట్టి నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి వేగించాలి. తర్వాత ఉడికించిన గుడ్ల మీద కత్తితో గాట్లు పెట్టి అందులో వేయాలి. సన్నని మంటపై వేగించాలి. కోడిగుడ్లు ఎరుపు రంగులోకి మారాక అల్లం-వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, ఉప్పు, కారం వేసి కాసేపు వేగించాలి. చివరగా కరివేపాకు,కొత్తిమీర తరుగు వేసి స్టవ్ ఆపేయాలి. మిశ్రమం చల్లారాక ఆవాల పొడి, మెంతి పొడి వేయాలి. ఆ పైన నిమ్మరసం వేసి కలిపితే రుచికరమైన కోడిగుడ్డు పచ్చడి రెడీ.

**ఎగ్ బజ్జీ తయారీకి కావాల్సినవి**

కోడిగుడ్లు -నాలుగు(ఉడికించినవి)
కార్న్ ఫ్లోర్-పావు కప్పు
శెనగపిండి- రెండు కప్పులు
బియ్యప్పిండి- ఒకటిన్నర కప్పు
ఉప్పు- తగినంత
నూనె-సరిపడా
వెల్లుల్లి తరుగు - అర టీస్పూన్
పచ్చిమిర్చి తరుగు - ఒక టీ స్పూన్
ఉల్లిగడ్డ తరుగు- పావు కప్పు
అల్లం తరుగు - పావు టీస్పూన్
ఎగ్ బజ్జీ తయారీ విధానం

**ఉడికించిన గుడ్లను ముక్కలుగా కట్ చేసి ఒక గిన్నెలో వేయాలి. తర్వాత అందులో శెనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, కార్న్ ఫ్లోర్, పచ్చిమిర్చి, నెల్లుల్లి, ఉల్లిగడ్డ, అల్లం తరుగు వేయాలి. కొన్నినీళ్లు చల్లి బజ్జీల్లా చేసి, మరుగుతున్న నూనెలో వేసి వేగించాలి. బజ్జీలు గోధుమరంగులోకి మారాక తీయాలి. వాటిపై ధనియాల పొడి, గరం మసాలా చల్లి తింటే బాగుంటాయి.**

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తర్వాత టీమిండియా కోచ్‌ల్లో ఒకరు రాజీనామా?

- టెన్ డుస్కాటే రాజీనామాకు సిద్ధమైనట్లు కథనం
- బీసీసీఐకి నిర్ణయం తెలిపినట్లు సమాచారం
- ఇంగ్లండ్ సిరీస్ తర్వాత తప్పుకొనే అవకాశం
- వ్యక్తిగత కారణాలతోనే నిర్ణయమని సమాచారం
- కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని భావన




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ముగిసిన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని ఇప్పటికే బీసీసీఐకి తెలియజేసినట్లు క్రిక్‌బజ్ కథనం వెల్లడించింది. బీసీసీఐతో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరిస్తే, ఇంగ్లండ్‌తో చివరి వన్డే అతడికి భారత జట్టుతో ఆఖరు మ్యాచ్ కానుంది.

టెన్ డస్కాటే నిర్ణయానికి అసంతృప్తి కారణం కాదని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో పాటు కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. లండన్‌లో నివసిస్తున్న తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపడంతో పాటు తక్కువ ప్రయాణాలు ఉండే బాధ్యతలను స్వీకరించాలని అతడు భావిస్తున్నట్లు వెల్లడించింది.రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయ కోచ్‌గా టెన్ డస్కాటే బాధ్యతలు చేపట్టాడు. అతడి తొలి ఒప్పందం కూడా ఇటీవలే ముగిసినట్లు సమాచారం. గౌతమ్ గంభీర్ సిఫార్సుతోనే అతడు కోచింగ్ బృందంలో చేరగా, రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయంలో గంభీర్‌కు కూడా అభిప్రాయం చెప్పే అవకాశం ఉందని కథనం పేర్కొంది.

అయితే అతడి రాజీనామాను అడ్డుకునే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలిపింది.మరోవైపు, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ల్లో గంభీర్‌కు పూర్తి స్థాయి జట్టు అందుబాటులో లేదన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా లేకపోవడం ప్రభావం చూపిందని చెప్పాడు. రెండు సిరీస్‌ల్లో ఓడిపోయినంత మాత్రాన గంభీర్‌ను విమర్శించడం తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించాడు.

## ఎడ్జ్‌బాస్టన్ లో భారత బౌలర్ల జోరు.. 258 పరుగులకే ఇంగ్లండ్ ఆలౌట్

- భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో 258 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్
- 76 పరుగులతో అజేయంగా నిలిచి ఒంటరి పోరాటం చేసిన జో రూట్
- 68 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడిన లియామ్ డాసన్
- నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన స్పిన్నర్ అక్షర్ పటేల్
- భారత బౌలర్ల ధాటికి కుప్పకూలిన ఇంగ్లండ్ టాప్ ఆర్డర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టును 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌట్ చేశారు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, మాజీ కెప్టెన్ జో రూట్ (76 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్ (68) అర్ధశతకంతో రాణించాడు. దీంతో టీమిండియా ముందు 259 పరుగుల లక్ష్యం నిలిచింది.ఇన్నింగ్స్ ఆరంభంలో ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే, ఈ దశలో భారత బౌలర్లు పుంజుకున్నారు. కేవలం 19 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ 4 కీలక వికెట్లు కోల్పోయి 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు క్యూ కట్టారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన జో రూట్, లియామ్ డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 121 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. డాసన్ ఔటయ్యాక, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. చివర్లో జోఫ్రా ఆర్చర్ (12) వేగంగా ఆడినా, అక్షర్ తన స్పిన్‌తో టెయిలెండర్లను చుట్టేశాడు.భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ, అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ చెరో 2 వికెట్లు తీశారు. జస్ప్రీత్ బుమ్రా, శివమ్ దూబేలకు తలో వికెట్ దక్కింది. బుమ్రా తన 9 ఓవర్లలో కేవలం 31 పరుగులే ఇచ్చి ఇంగ్లండ్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. కీలకమైన కెప్టెన్ హ్యారీ బ్రూక్ వికెట్ ను తన ఖాతాలో వేసుకున్నాడు.

## ఒకే స్టేడియం.. ఒకే మ్యాచ్.. మాట్లాడుకోని గంభీర్, కోహ్లీ.. భారత జట్టులో మళ్లీ కోల్డ్ వార్?






**హైదరాబాద్ పెన్ పవర్:** జశీశ్రీ౦స ఝెుతీ~ాస్త్రుఖఅఅ ఖశీష్ట్రశ్రీఅ జ౦ +ఖఎఎష్ట్రఅతీ: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న 3 వన్డేల సిరీస్‌కు ముందు భారత జట్టులో కోల్డ్ వార్ కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అనే అనుమానాలు ఇప్పుడు ఫ్యాన్స్ ని తెగ వేధిస్తున్నాయి. బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లాండ్‌తో తొలి వన్డేకి ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్స్ లో ఈ ఇద్దరు కనీసం మాట్లాడుకోలేదని వస్తున్న వార్తలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

**నెట్స్‌లో కనిపించని కెమిస్ట్రీ:**

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్‌ను గంభీర్ చాలా నిశితంగా గమనించారు. కానీ నేరుగా కింగ్ కోహ్లీ దగ్గరికి వెళ్లి సలహాలు ఇవ్వకుండా, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ద్వారా సందేశాలు పంపడం గమనార్హం. ఈ సెషన్‌లో అనవసర షాట్లకు ప్రయత్నించి కోహ్లీ కొన్నిసార్లు క్లీన్ బౌల్డ్ కావడంతో, గంభీర్ స్వయంగా వెళ్లిపోకుండా.. బ్యాటింగ్ కోచ్‌కు చెప్పి కోహ్లీతో మాట్లాడించారు. ఈ ఇండైరెక్ట్ కమ్యూనికేషన్ కి సంబంధించిన వీడియో ఒక్కసారిగా నెట్టింట వైరల్ కావడంతో, వీరిద్దరి మధ్య మళ్లీ లొల్లి స్టార్ట్ అయిందనే ప్రచారం జరుగుతుంది.

**గిల్, రోహిత్‌లతో మాటలు.. కోహ్లీతో మాత్రం నో టాక్స్:**

ప్రాక్టీస్ ముగిసిన తర్వాత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్టేడియంలో రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌లతో పాటు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో సుదీర్ఘంగా మాట్లాడాడు. కానీ, భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో మాత్రం ఒక్కసారిగా మాట్లాడినట్లు ఎక్కడ కూడా కనిపించలేదు. అటు కోహ్లీ కూడా గంభీర్ సైడ్ వెళ్లేందుకు కూడా ప్రయత్నిం చేయలేదు. ఈ నిశ్శబ్ద యుద్ధం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న కోల్డ్ వైబ్స్ కు అద్దం పడుతోందని ఇంటర్నేషనల్ మీడియా కోడైకూస్తుంది.



వెల్వెట్ బ్లాక్ దుస్తుల్లో 'పవర్ గ్లామర్'ను ప్రదర్శిస్తున్న శామా సికందర్

## ఆన్‌స్క్రీన్ ఫ్లాప్.. ఆఫ్‌స్క్రీన్ సూపర్ హిట్!



సినిమా ఇండస్ట్రీలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ చిగురించడం, ఆ తర్వాత వారు పెళ్లి బంధంతో ఒక్కటవ్వడం మనం తరచూ చూస్తూనే ఉంటాం. అయితే ఆశ్చర్యకరంగా టాలీవుడ్‌లో కొంతమంది స్టార్స్ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోరంగా ఫ్లాప్ అయ్యాయి. కానీ, ఆ సినిమాలే వారి జీవిత భాగస్వాములను వారికి పరిచయం చేశాయి. ఆన్‌స్క్రీన్‌పై ఫ్లాప్ అయినప్పటికీ, ఆఫ్‌స్క్రీన్‌లో సూపర్ హిట్ అయిన ఆ క్రేజీ రియల్ లైఫ్ జంటల ముచ్చట్లు మీకోసం..

**జీవిత – రాజశేఖర్:**

టాలీవుడ్ సీనియర్ కపుల్ యాంగ్రీ స్టార్ రాజశేఖర్, జీవితలది ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ. వీరిద్దరూ 'తలంబ్రాలు' సినిమాతో తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇక ఆ సినిమా టైమ్‌లోనే వీరిద్దరి ఆలోచనలు కలవడంతో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 1991లో పెళ్లి చేసుకున్న ఈ సీనియర్ జంట ఇప్పటికీ ఇండస్ట్రీలో బెస్ట్ కపుల్‌గా కొనసాగుతున్నారు.

**మహేష్ బాబు – నమ్రత శిరోద్కర్:**

టాలీవుడ్‌లోనే మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ క్రేజీ కపుల్ ఎవరంటే మహేష్ బాబు, నమ్రత జంట అని కచ్చితంగా చెప్పొచ్చు. వీరిద్దరూ కలిసి 'వంశీ' అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంత పెద్ద ఫ్లాప్ అయిందో అందరికీ తెలిసిందే. కానీ ఈ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్నారు.

**వరుణ్ తేజ్ – లావణ్య త్రిపాఠి:**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి లవ్ స్టోరీ కూడా ఇలాంటిదే. వీరిద్దరూ కలిసి నటించిన మొదటి సినిమా 'మిస్టర్' అట్టర్ ఫ్లాప్‌గా నిలిచింది. కానీ ఈ సినిమా సెట్స్‌లోనే వీరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఇక దాదాపు నాలుగేళ్ల పాటు తమ ప్రేమను సీక్రెట్‌గా ఉంచిన ఈ జంట, ఆ తర్వాత ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అన్యోన్య దంపతులకు ఒక కొడుకు కూడా ఉన్నాడు.

**నారా రోహిత్ – సిరి లెల్లా:**


నటుడు నారా రోహిత్ కూడా తన సినిమా హీరోయిన్నే లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. రోహిత్, సిరి లెల్లా జంటగా 'ప్రతినిధి 2' అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా ఆడియన్స్‌ను పెద్దగా ఆకట్టుకోలేక ఫ్లాప్ లిస్ట్‌లో చేరింది. అయితే ఈ సినిమా పరిచయంతోనే ఒకటైన ఈ ఇద్దరూ, గతేడాది వివాహ బంధంతో అధికారికంగా తమ రియల్ లైఫ్ జర్నీని స్టార్ట్ చేశారు.

**వరుణ్ సందేశ్ – వితికా షేరు:**

ఇక వరుణ్ సందేశ్ 'కొత్త బంగారు లోకం' సినిమాతో ఒకప్పుడు యూత్‌లో ఓ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత వరుస ఫ్లాపులు పడుతున్న సమయంలో వితికాతో కలిసి 'పడ్డానండీ ప్రేమలో మరి' అనే సినిమాలో నటించాడు. ఇక ఈ సినిమా ఫ్లాప్ అయినా, వీరిద్దరూ మాత్రం నిజంగానే ఒకరి ప్రేమలో ఒకరు పడిపోయి పెళ్లి పీటలెక్కారు.

**రితేష్ దేశ్ ముఖ్ – జెనీలియా:**

తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న జెనీలియా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్‌ను ప్రేమించి పెళ్లాడింది. వీరిద్దరూ కలిసి నటించిన 'తుజే మేరీ సనమ్' అనే హిందీ చిత్రం యావరేజ్‌గా ఆడింది. ఆ సినిమాతో మొదలైన వీరి బంధం పెళ్లి వరకు తీసుకెళ్లింది. ఇక ప్రస్తుతం ఈ జంట బాలీవుడ్‌లోనే మోస్ట్ హ్యాపియెస్ట్ కపుల్‌గా పేరు తెచ్చుకుంది. సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా, మనసు కలిస్తే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఈ సెలబ్రిటీ జంటలను చూస్తే అర్థమవుతుంది. వెండితెరపై ఫ్లాప్ టాక్ తెచ్చుకున్నప్పటి కీ, నిజ జీవితంలో మాత్రం ఒకరికొకరు తోడుగా ఉంటూ వందకు వంద మార్కులతో సూపర్ హిట్ జంటలుగా దూసుకుపోతున్నారు.




అద్భుతమైన సంప్రదాయ రూపంతో అభిమానుల మనసు గెలుచుకున్న నాభా నటేష్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965